epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 27 | సంచిక: 164 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 19 ఏప్రిల్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



# మహిళా బిల్లు అడ్డుకోవడం ముమ్మాటికి భ్రూణహత్యే

కాంగ్రెస్, ఎస్పీ, తృణమూల్, డీఎంకేలదే ఈ బాధ్యత

- కుటుంబ పార్టీలతో మహిళలకు న్యాయం జరగదు
- అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరిగేలా సవరణ బిల్లు తెచ్చాం
- రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- ఈ పాపం ఆ పార్టీలను వదిలి పెట్టదు.. మహిళా శక్తి ఊరుకోదు
- జాతిని ఉద్దేశించిన చేసిన ప్రసంగంలో మోడీ ఘాటు విమర్శలు

"భారత నారీశక్తి ఎదగకుండా కాంగ్రెస్ తదితర విపక్షాలు అడ్డుకున్నాయని ప్రధాని మోదీ ఆక్షేపించారు. భారత మహిళల కలలను ధ్వంసం చేశారని విమర్శించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో.. దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈ బిల్లును ఆమోదింపచేయకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. ఇది ముమ్మాటికీ భ్రూణ హత్యేనని అన్నారు. దేశ హితమే తమకు అత్యంత ముఖ్యమని, కొందరికి మాత్రం దేశం కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు."

3




## రైతుభరోసా విడుదలకు సిద్ధం

రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

.. వివరాలు 2లో




## 26 వరకు వర్షాలు

ఈదురుగాలులతో కూడిన వానలు
పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్
వాతావరణ శాఖ వెల్లడి

.. వివరాలు 3లో

## బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

నలుగురు అనుమానితుల అరెస్టు



.. వివరాలు 3లో



# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

## బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం

### దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం

- చిత్తశుద్ధి ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
- అందుకు ఇండి కూటమి మద్దతు ఇస్తుంది
- బీజేపీతో జతకట్టిన పార్టీలకు ఎదురుదెబ్బలు తప్పవు
- తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా

మిగతా 2 లో



## బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్

2

## మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

- మహిళా బిల్లును అడ్డుకోవడం దుర్మార్గం
- నిడదవోలులో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో నిరసన
- ర్యాలీలో పాల్గొన్న చంద్రబాబు కాంగ్రెస్‌పై ధ్వజం



5

## రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

- నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- మండిపడ్డ జనసేన నేత నాగబాబు
- విశ్వహిందూ పరిషద్ తీవ్ర హెచ్చరిక
- ప్రకాశ్ రాజ్‌పై వందకోట్లకు టీటీడీ బోర్డు పరువు నష్టం

5



## పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ





## ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన

## కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం
- విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష
- వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి
- ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..
- కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి పొంగులేటి

రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు.

2





# స్కూల్ పరిసరాల్లో సిగరెట్, గుట్కా నిషేధం

## పాన్ షాపుల్లో పోలీసుల తనిఖీలు..హెచ్చరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** ఆపరేషన్ సేఫ్ స్కూల్ పేరుతో విద్యాసంస్థల దగ్గర ఉండే పాన్ షాపుల వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్,స్పెషల్ టీం, ఎచ్ న్యూ మొత్తం 5000 మంది సిబ్బంది ఈ రైడ్స్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో ఉన్న 500కుపైగా పాన్ షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. విద్యాసంస్థలకు 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తులు విక్రయించ కూడదని సీపీ సజ్జనార్ ఆదేశించారు. అలా విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు పాన్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని.. తీరు మార్చుకోకపోతే తీవ్రమైన చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. స్కూలు పరిసరాలు పొగాకు రహితంగా ఉండాలని సూచించారు. స్కూల్ పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని తమకు పలు ఫిర్యాదులు అందుతున్నాయని ప్రస్తావించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెంది తమకు ఫిర్యాదులు చేశారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. తమ పోలీస్ సిబ్బంది కూడా డికాయ్ ఆపరేషన్ నిర్వహించారని.. పొగాకు ఉత్పత్తులు స్కూల్ విద్యార్థులకు అమ్ముతున్నట్లు తమ విచారణలో తేలిందని చెప్పుకొచ్చారు. స్కూళ్ల వద్ద కొన్ని రోజుల నుంచి నిఘా పెట్టామని.. ఈరోజు ఐదు వేలమంది పోలీసులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. పొగాకు ఉత్పత్తులను విద్యార్థులు తీసుకోవడం మొదలుపెడితే.. డ్రగ్స్ వైపు మళ్లే అవకాశం ఉంటుందని అన్నారు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బ్యాన్ అయిన పాన్ మసాలాలు, గుట్కాలు వంటివి ఎవరైనా అమ్ముతున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. కొన్ని పాన్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న వస్తువులను సీజ్ చేశారు పోలీసులు. లోకల్ వస్తువులకు బ్రాండెడ్ ముద్ర వేసి అమ్ముతున్న కొన్నింటిని.. అదే విధంగా ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ హిల్స్ లోని ఓ పాన్ షాపులో ఈ సిగరెట్లు, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

# తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్రమంత్రి అల్పాహార విందు

## హాజరైన సీఎం రేవంత్ సహా పలువురు నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** తెలుగు రాష్ట్రాల నేతలకు ఆంధ్ర నుంచి కేంద్రమంత్రిగా ఉన్న భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆతిథ్యం ఇచ్చారు. శనివారం ఉదయం తెలుగు రాష్ట్రాల నేతలకు కేంద్ర మంత్రి అల్పాహార విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అల్పాహార విందులో ఎటువంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాటికి హైదరాబాద్ క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఈవీ బస్సులు ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపులు చేశామని.. త్వరలో అందజేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ 2029 నుంచి అమలు చేసేందుకు ఒక ప్రయత్నం చేశామని.. కానీ విపక్షాలు వ్యతిరేకించాయన్నారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్ అమలు కావాలని ఆశిద్దామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. అల్పాహార విందుకు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, కుమారస్వామి, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ హాజరయ్యారు. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కూడా ఈ విందులో పాల్గొన్నారు.

# ఐపీఎస్‌ల బదిలీ

## 9 మందికి కొత్త బాధ్యతలు!

### జిల్లా అదనపు ఎస్పీలుగా యువ అధికారులకు ప్రమోషన్లు

### తక్షణమే అమల్లోకి రానున్న ఉత్తర్వులు..

### జిల్లాల వారీగా కొత్త పోస్టింగ్‌లు

**హైదరాబాద్, ఏప్రిల్19:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ యంత్రాంగంలో కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ సాధారణ పరిపాలన విభాగం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా ఏఎస్పీలుగా ఉన్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ జిల్లా అదనపు ఎస్పీలుగా (అడ్మిన్) బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఆసిఫాబాద్ ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్. చిత్తరంజన్‌ను అదే జిల్లాకు అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. కామారెడ్డి ఏఎస్పీ బొక్కా చైతన్య రెడ్డి సంగారెడ్డి అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు. జంగావ్ ఏఎస్పీగా ఉన్న పందేరే చేతన్ నితిన్‌ను జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్‌ను మెదక్ జిల్లాకు బదిలీ చేయగా, వరంగల్ ఏఎస్పీ నగ్రాలే శుభమ్ ప్రకాశ్‌ను నిజామాబాద్ జిల్లా అదనపు ఎస్పీగా (అడ్మిన్) నియమించారు. భైంసా ఎస్డీపీఓగా పనిచేస్తున్న రాజేష్ మీనా వనపర్తికి బదిలీ అయ్యారు. ఆదిలాబాద్‌లో ఉన్న మౌనికను అదే జిల్లాలో అదనపు ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నిర్మల్ ఏఎస్పీ పథిపాక సాయికిరణ్‌ను భైంసా ఎస్డీపీఓగా, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టేను ఉట్నూరు ఎస్డీపీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని, సంబంధిత అధికారులు వెంటనే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు జిల్లా స్థాయి పోలీస్ పరిపాలనను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు జరిగినట్లు తెలుస్తోంది.

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని



మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు

- కుమారస్వామికి విజ్ఞప్తి చేసిన సీఎం రేవంత్
- ప్రియాంకను కలిసి బిల్లును ఓడించినందుకు అభినందనలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాసవర్మను సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కుమారస్వామికి విజ్ఞప్తి చేశారు. దీని ద్వారా ఉక్కు కొరత తగ్గడంతోపాటు.. పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం వివరించారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసే పరిశ్రమను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్‌ను కాలుష్యం లేని నగరంగా మార్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బిజీబిజీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమను తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర పారిశ్రామిక విజన్ డాక్యుమెంట్‌ను కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న దృష్ట్యా ఈవీ బ్యాటరీ తయారీ కేంద్రం ఏర్పాటుకు విన్నవించారు. ఆటో, రక్షణ రంగాల ఉత్పత్తులు, రోబోటిక్స్ తయారీకి ప్రత్యేక పార్కుల కోసం ప్రతిపాదించారు ముఖ్యమంత్రి. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు కేంద్రం సహకారం కోరారు. ఆధునిక పరిశ్రమలకు అనుగుణంగా జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కుమార స్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే వయనాడ్ ఎంపీ, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఓడించినందుకు ప్రియాంకకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఉన్న అసలు విషయాలను ప్రియాంక



గాంధీ బయటపెట్టారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల తరఫున రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు ధన్యవాదాలు తెలియజేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను ఏకీకృతం చేయడంలో నా కృషిని ప్రియాంక గాంధీ అభినందించారు' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.




# రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

## రేపు కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# కొత్త ఎయిర్‌పోర్ట్‌ల పనులు వేగవంతం చేయాలి

## మంత్రి పొంగులేటి ఆదేశం.. విమానాశ్రయాలపై ఉన్నతస్థాయి సమీక్ష

### వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 953 ఎకరాల భూసేకరణ పూర్తి.. త్వరలోనే శంకుస్థాపన

### ఆదిలాబాద్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచన..

## కొత్తగూడెంపై నివేదిక కోరిన మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకుని వెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ క్రమంలో వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణను సిద్ధం చేసిందని అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల నిర్మాణం వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సాంకేతిక అనుమతులు, మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి తదితరులతో కలిసి వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ పనులను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని తెలిపారు. వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్ (రక్షణ శాఖ) సివిల్ ఏవియేషన్ (పౌర విమానయాన శాఖ) , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.



# తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతీసిన తేజస్వీసూర్య

- పెదవి విప్పని తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ
- ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలే ప్రసక్తి లేదు
- రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే అన్న హరీష్ రావు
- రాజకీయ పునరేకీకరణ ప్రారంభమయ్యిందన్న కేటీఆర్
- జగిత్యాలలో కేసీఆర్ ఆశీర్వాద సభ ఏర్పాట్లు పరిశీలన



**జగిత్యాల, ఏప్రిల్ 18:** బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్సభలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్రావు మాట్లాడారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ - పాక్ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చుతారా అంటూ మాజీ మంత్రి మండిపడ్డారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిందన్నారు. పార్లమెంట్లో బిల్లు పాస్ అయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని హరీశ్ రావు తెలిపారు. ఎంపీ తప్పు మాట్లాడితే.. క్షమాపణ చెప్పాల్సింది పోయి వెనుకేసుకుని వస్తున్నారని మండిపడ్డారు. లోక్ సభలో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు తెలుస్తోందన్నారు. బీజేపీ ఎంపీ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పెదవులు మూసుకుని కూర్చున్నారని మండిపడ్డారు. తేజస్వి సూర్య మూతి పగిలే సమాధానం చెప్పలేకపోయారని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారన్నారు. మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు. ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.మహిళా బిల్లును డీలిమిటేషన్తో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మెజారిటీ లేకున్నా బిల్లు పెడతారా అని నిలదీస్తూ.. రాజకీయం కోసమే బిల్లు ప్రవేశపెట్టారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు టి.జీవన్ రెడ్డి బీఆర్ఎస్లో చేరబోతున్న సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం కనిపిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న కేసీఆర్ ' ప్రజా ఆశీర్వాద సభ' ఏర్పాట్లను మాజీ మంత్రి హరీష్రావు, కొప్పుల ఈశ్వర్ , ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని వెల్లడించారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని, జగిత్యాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని దీమాను వ్యక్తం చేశారు.కేసీఆర్ బయటకు వస్తే గుంట నక్కలు బయపడుతున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ జగిత్యాలలో సభ ఉంటే మేడి గడ్డలో రేవంత్ సభ ఏర్పాటు చేసుకున్నాడని విమర్శించారు. రేవంత్ హైట్లో చిన్న అనుకున్న. కానీ రేవంత్ది చిన్న మెదడని, ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే హై బ్రిడ్, క్రాస్ బ్రిడ్ ఎమ్మెల్యేనా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కేసీఆర్ సభ విజయవంతమవుతుందని, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని అన్నారు. ఈనెల 20న కేసీఆర్ సాయంత్రం 5,30 నిముషాలకు చేరుకుంటారని వివరించారు. సుమరు గంట సేపు కేసీఆర్ సభ ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

# రాష్ట్రంలో 26 వరకు వర్షాలు

**ఈదురుగాలులతో కూడిన వానలు..**

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**వాతావరణ శాఖ వెల్లడి**



**హైదరాబాద్, ఏప్రిల్18:** ఎండలతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలో ఈనెల 26వ తేదీ వరకు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తనంతో పాటు క్యూములోనింబస్ మేఘాలు ఏర్పడటం వల్ల ఈ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ మరియు కామారెడ్డి జిల్లాల్లో వానలు పడతాయని తెలిపారు. గాలిలో తేమ శాతం పెరగడం, మేఘాల కదలికల వల్ల ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో చోటుచేసుకున్న ఈ మార్పులు కేవలం ఒక రోజుకే పరిమితం కాకుండా, నేడు కూడా కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రేపు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ ధాన్యం మరియు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# డీలిమిటేషన్కు మహిళా బిల్లు ముసుగు

**దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన పక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# పులి వస్తే.. ఎన్ని మేకలను మింగిందో బయటపెడతాం!

- కాళేశ్వరంలో 'పులి' ఏం చేసిందో ప్రజలకు వివరిస్తాం
- 20న అన్ని విషయాలు వెల్లడిస్తాం
- కేసీఆర్ జగిత్యాల సభపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సెటైర్లు
- మహిళా బిల్లు పతనం మోదీ అహంకారానికి చెంపపెట్టని విమర్శ



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాలలో నిర్వహించనున్న సభపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. శనివారం గాంధీభవన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ను 'పులి'గా అభివర్ణించే వారిపై విమర్శలు గుప్పించారు. "పులి బయటకు వస్తే.. ఆ పులి ఎన్ని మేకలను మింగిందో, ఎన్ని ఆవులను తిన్నదో మేం బయటపెడతాం. ఆ పులి ఆసరా చూసుకుని ఎన్ని పిల్లులు లాభపడ్డాయో కూడా వివరిస్తాం" అంటూ ఘాటుగా హెచ్చరించారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ, ఈ నెల 20వ తేదీన అన్ని విషయాలను ప్రజల ముందు ఉంచుతామని స్పష్టం చేశారు.

**బీజేపీ ఎంపీలు 'యాక్సిడెంటల్' లీడర్లు**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా మహేశ్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ పాత్రే లేదని, ఆ పార్టీ ఎంపీలంతా 'యాక్సిడెంటల్ లీడర్లు' అని ఎద్దేవా చేశారు. మతాల మధ్య, కులాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప వారికి ఏమీ తెలియదని మండిపడ్డారు. "కర్ణాటక ఎంపీ (తేజస్వీ సూర్య) తెలంగాణను కించపరుస్తూ మాట్లాడుతుంటే రాష్ట్ర బీజేపీ ఎంపీలు నిద్రపోతున్నారా?" అని నిలదీశారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కనీసం ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం ప్రధాని నరేంద్ర మోదీ అహంకారానికి చెంపపెట్టు వంటిదని మహేశ్ గౌడ్ అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేసి, ఉత్తర భారతదేశానికి సీట్లు పెంచాలనే కుట్రను ప్రతిపక్షాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని చెప్పారు. మనువాద భావజాలం ఉన్న బీజేపీకి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి లేదని, దేశానికి తొలి మహిళా ప్రధానిని, రాష్ట్రపతిని అందించిన ఘనత కాంగ్రెస్దేనని గుర్తు చేశారు.

**కిషన్ రెడ్డికి సవాల్**

ఎన్నికల సమయంలో మాత్రమే బీజేపీ నేతలకు దేవుడు గుర్తుకొస్తారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. "జై శ్రీరామ్ అనకుండా తాను చేసిన అభివృద్ధిపై ప్రచారం చేసుకుని కిషన్ రెడ్డి గెలవగలరా?" అని సవాల్ విసిరారు. దేవుడి పేరు చెబితే ఓట్లు రాలే పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకే కేటాయించామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



# మహిళా బిల్లుపై నిరసనలకు పిలుపు

**బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు గృహ నిర్బంధం**

**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించేందుకు పిలుపునివ్వడంతో శనివారం ఉదయాన్నే రాంచందర్ రావు ఇంటికి వెళ్లిన పోలీసులు గృహ నిర్బంధం చేశారు. లోక్ సభలో శుక్రవారం మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ అడ్డుకుందంటూ రేవంత్ ఇంటి ముట్టడికి బీజేపీ సిద్ధమైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. మ-రోవైపు పోలీసులు తనను నిర్బంధించడంపై ఆయన ఆగ్రహించారు. నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ను వదిలిపెట్టేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరికి నిరసనగా ఈరోజు దేశ వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామన్నారు. పోలీసులు తనను హౌస్ అరెస్ట్ చేశారని, అయినా తమ పార్టీ శ్రేణులు, నాయకులు రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు. దేశంలో ఇంకా రాచరిక పాలన కావాలని కాంగ్రెస్ భావిస్తోందని మండిపడ్డారు. ఒక్క ముస్లిం సమాజానికి మేలు చేసేందుకు ఈ డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. దేశ ప్రజలు, తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగుల ఉసురు తప్పదు

**ఉద్యోగుల జీతభత్యాలు సకాలంలో ఇవ్వడం లేదు**

**పెన్షనర్లకు సకాలంలో అందని బకాయిలు**

**ఐదు డీఏలు పెండింగ్లోనే ఉన్నాయి**

**ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత జి దేవీ ప్రసాద్**



**హైదరాబాద్, ఏప్రిల్ 18:** తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత, జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్లో ఉన్నాయని, సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు. ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని, రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమీషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు. ఉపాధ్యాయ సంఘం మాజీ నాయకులు భుజంగ రావు తదితరులు మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# 20నుంచి 26 వరకు వెల్ఫేర్ వీక్

**హైదరాబాద్, ఏప్రిల్18 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి ఏప్రిల్ 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'వెల్ఫేర్ వీక్' నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరుపై ఆయన శనివారం సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఈసందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్ రోజువారీ షెడ్యూల్ను వివరించారు జిల్లా కలెక్టర్లు ప్రతి కార్యక్రమం అమలును క్షుణ్ణంగా పర్యవేక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఘోష్ సూచించారు. ప్రజాప్రతినిధు లను అన్ని కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయాలని, తద్వారా విస్తృత ప్రచారం, పారదర్శకత పెరుగుతుందని ప్రణాళిక కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన పథకాలు సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రియాంక, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# మహిళలను ఏకం చేస్తాం : లక్ష్మణ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18:** రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించి, మహిళల హక్కులను విపక్షాలు కాల రాశాయని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మహిళలు కదం తొక్కుతున్నారని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దక్షిణాది ప్రజలు కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. 'మోదీకి ఆదరణ పెరుగుతుంది, భాజపా బలపడుతుందనే బిల్లును అడ్డుకున్నారు. మహిళలను చట్టసభలకు రాకుండా అడ్డుకున్నారు. దక్షిణాదికి అన్యాయం జరగదని చెప్పినా సాంకేతిక కారణాలతో మహిళా బిల్లును అడ్డుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళలను ఏకం చేసి కాంగ్రెస్, విపక్షాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం. డీలిమిటేషన్, 131వ రాజ్యాంగ సవరణ బిల్లుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రతిపాదనను ఒక్క ఎంపీ కూడా పార్లమెంట్లో ప్రస్తావించలేదని లక్ష్మణ్ అన్నారు.



సంపాదకీయం

# మోదీ సర్కారుకు గుణపాఠం

## విపక్షాల ఐక్యతతో 'సవరణ'కు బ్రేక్!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోదీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఎ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నఫళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్యాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటంపై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పించారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# మహిళలకు విపక్షాలు వ్యతిరేకం



- బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
- ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
- కేబినెట్ భేటీలో ప్రధాని మోదీ సూచన
- కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఏ పెంపు
- 13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

# మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

- డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
- అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
- తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్



**చెన్నై, ఏప్రిల్ 18:** మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్ఎస్ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు. తమిళనాడు తన భవిష్యత్తును తానే నిర్దేశించుకుంటుందని, తమిళ సంస్కృతి, హక్కులు, భాషా పరిరక్షణలో తాము ప్రజలకు బాసటగా ఉంటామని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# రాహుల్ గాంధీకి ఊరట

## పౌరసత్వ వివాదంలో ఎఫ్ఐఆర్ నమోదుపై హైకోర్టు స్టే



**ప్రయాగ్‌రాజ్, ఏప్రిల్ 17:** పౌరసత్వ వివాదంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ఆదేశాలపై అలహాబాద్ హైకోర్టు శనివారం స్టే విధించింది. శుక్రవారం రాహుల్‌పై విచారణకు ఆదేశించిన అదే లక్నో బెంచ్, నేడు ఆ నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాహుల్ గాంధీ బ్రిటీష్ పౌరసత్వం కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాలని జస్టిస్ సుభాష్ విద్యార్థి నేతృత్వంలోని బెంచ్ శుక్రవారం మౌఖికంగా ఆదేశించింది. అయితే, ఈ తీర్పు కాపీపై సంతకం చేసే ముందే కోర్టు తన నిర్ణయాన్ని సమీక్షించుకుంది. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి (రాహుల్ గాంధీ) వాదన వినకుండా ఏకపక్షంగా ఆదేశాలు ఇవ్వడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 2014 నాటి ఒక ఫుల్ బెంచ్ తీర్పును ఉటంకిస్తూ, నిందితుడికి నోటీసులు ఇచ్చి వివరణ కోరడం తప్పనిసరని కోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విగ్నేష్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. 2003-2009 మధ్య లండన్‌లోని 'బ్యాక్ ఆప్స్ లిమిటెడ్' అనే కంపెనీకి డైరెక్టర్‌గా ఉన్న సమయంలో రాహుల్ గాంధీ తనను తాను బ్రిటీష్ పౌరుడిగా పేర్కొన్నారని, ఇది భారత రాజ్యాంగం ప్రకారం చట్టవిరుద్ధమని ఆయన వాదన.

# బొమ్మ కార్లతో పేలుళ్లకు ప్లాన్

## నలుగురు అనుమానితుల అరెస్టు

**న్యూఢిల్లీ:** సున్నితమైన ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పేలుళ్లు జరిపేందుకు రెక్కీలు నిర్వహిస్తూ, ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫాంల ద్వారా ఇతరులను రిక్రూట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్న నలుగురు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. నిఘా ఆధారిత ఆపరేషన్ ద్వారా ఇద్దరు నిందితులు మోసైబ్ అహ్మద్, హహమ్మద్ హమాద్‌ను మహారాష్ట్రలో, షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తిని ఒడిశాలో, మహమ్మద్ సోహైల్‌ను బిహార్‌లో అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరిని ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు తయారీకి యత్నిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు నిందితులు తీవ్రవాద భావజాలంతో ప్రభావితమైనట్టు అధికారులు తెలిపారు. నిందితులలో ఒకడు ఎర్రకోట తమలక్ష్యమని తెలిపే సంకేతంతో నల్లజెండాతో కూడిన ఎర్రకోట మార్ఫింగ్ ఫోటోను షేర్ చేసినట్టు గుర్తించామని చెప్పారు. షేక్ ఇమ్రాన్ అనే నిందితుడు 2025లో ఎర్రకోట, ఇండియా గేట్ సహా కీలక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించినట్టు తెలిపారు. మోసైబ్ గతంలో గల్ఫ్ దేశాల్లో ఆటో ఎలక్ట్రీషియన్‌గా పనిచేశాడని, ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ కారు డిజైన్‌కు అవసరమైన సాంకేతిక నైపుణ్యం అతనికి ఉందని గుర్తించా మని వివరించారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేసి నిందితుల నెట్‌వర్క్ ఛేదించేం దుకు, ఇతర ముఠాలతో సంబంధాలను గుర్తించేందుకు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.



# హోర్ముజ్ జలసంధిలో హైటెన్షన్

## భారత ట్యాంకర్‌పై ఇరాన్ సైన్యం కాల్పులు!

## మళ్లీ మూతపడిన కీలక జలమార్గం..

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ దట్టంగా కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభనతో హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. శుక్రవారం జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన ఇరాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దిగ్బంధన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేయడంతో గంటల వ్యవధిలోనే మళ్లీ జలమార్గంపై ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో శనివారం జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) గన్‌బోట్లు కాల్పులకు పాల్పడటం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. ఇరాక్ నుంచి సుమారు రెండు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత్‌కు తీసుకువస్తున్న ఒక భారత జెండా కలిగిన సూపర్ ట్యాంకర్‌తో పాటు మరో వాణిజ్య నౌకపై ఇరాన్ సైన్యం కాల్పులు జరిపినట్లు 'ట్యాంకర్ ట్రాకర్స్' సంస్థ ధృవీకరించింది. ఓమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎటువంటి ముందస్తు రేడియో హెచ్చరికలు లేకుండానే ఇరాన్ గన్‌బోట్లు కాల్పులు జరపడంతో, సదరు నౌకలు తమ దిశను మార్చుకుని వెనక్కి మళ్లాయి. అదృష్టవశాత్తూ ఈ దాడుల్లో నౌకలకు గానీ, అందలి సిబ్బందికి గానీ ఎటువంటి ప్రాణహాని జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నారని సమాచారం అందింది. ఇరాన్ తన ఓడరేవులను తెరుస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, అమెరికా మాత్రం ఇరాన్‌పై తన నావికా దళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని ట్రంప్ ప్రకటించడం ఈ వివాదానికి ఆజ్యం పోసింది. "అమెరికా తన పద్ధతి మార్చుకోనంత వరకు హోర్ముజ్ జలసంధి తమ సైనిక నియంత్రణలోనే ఉంటుంది" అని ఇరాన్ మిలిటరీ కమాండ్ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు సరఫరా చేసే భారత్‌కు చెందిన మరికొన్ని నౌకలు కూడా తమ ప్రయాణాన్ని నిలిపివేసి సురక్షిత ప్రాంతాలకు మళ్లాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు హోర్ముజ్ జలసంధి నుండే వెళ్లాల్సి ఉంటుంది. తాజా కాల్పుల ఘటనతో అంతర్జాతీయ చమురు ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రయత్నాలు జరుగుతున్నా, మరోవైపు ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణ వాతావరణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపేలా కనిపిస్తోంది. ప్రస్తుతానికి భారత విదేశాంగ శాఖ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.



# దత్తపుత్రుడి బండారం బయట పడింది

## బీజేపీతో అనుబంధం బట్టబయయలు

## జగన్ తీరుపై మండిపడ్డ వైఎస్ షర్మిల

**అమరావతి, ఏప్రిల్ 18:** జగన్ చేసిన నీచపు పనికి వైఎస్సార్ ఆత్మ నిజంగా ఘోషిస్తోందని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్‌కి లింక్ పెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని విమర్శించారు. బీజేపీతో ఆయన పెట్టుకున్న అక్రమపొత్తు తేటతెల్లమైందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు. విపక్షం ముసుగులో ఉన్నది సైతం బిజెపి పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని తెలిపారు. వైసీపీ హయాంలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా? అని ప్రశ్నించారు. కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బతకాలా? అని ఎద్దేవా చేశారు. ఇదేనా జగన్ చెప్పే వైఎస్సార్ ఆశయాలు, వారసత్వం? అని నిలదీశారు. మహానేత వైఎస్సార్ సిద్ధాంతాలను మంట గలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు ఎవరు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మహిళలకు అగ్రతాంబూలం అందిస్తుంటే అభ్యంతరం ఎవరికీ లేదని అన్నారు. కాంగ్రెస్‌తో సహా దేశవ్యాప్తంగా విపక్షాల ఐక్యత ఒకటేనని చెప్పుకొచ్చారు. మహిళా బిల్లు పాస్ అయ్యింది 2023లోనేనని ప్రస్తావించారు. నియోజకవర్గాల పునర్విభజనపై, మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్టాండ్ క్లియర్‌గా ఉందని వ్యాఖ్యానించారు. 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలని షర్మిల సూచించారు. కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీల సంఖ్య తేలాలని అన్నారు. కులాల ఆధారంగా డీ లిమిటేషన్‌లో రిజర్వేషన్లు పాటించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుత 543 స్థానాలకు తక్షణం మహిళా రిజర్వేషన్లను పాటించాలని సూచించారు. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని సమ్మతమైన పరిష్కారం చూపాలని అన్నారు. అధికారిక గణాంకాలు లేకుండా 50 శాతం పెంచి? దేశాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీజేపీ చెబితే గుడ్డిగా జగన్ సైతం నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల పేర్కొన్నారు.

# ఏపీలో ఐఏఎస్‌ల బదిలీ

## నలుగురికి కొత్త బాధ్యతలు!

### ఐటీడీఏ, జాయింట్ కలెక్టర్ పోస్టింగ్‌లలో యువ అధికారులకు ప్రాధాన్యత

### గిరిజన ప్రాంతాల అభివృద్ధి, జిల్లా పరిపాలనలో సమర్థతే లక్ష్యం

### పోలవరం జేసీగా ప్రశాంత్ కుమార్.. కోనసీమకు నిడియా దేవి

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలన విభాగంలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నలుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, జిల్లా పరిపాలనలో సమర్థతను పెంచే లక్ష్యంతో యువ ఐఏఎస్ అధికారులకు కీలకమైన ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లుగా, జాయింట్ కలెక్టర్లుగా బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం.. సురపాటి ప్రశాంత్ కుమార్ పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. దీనితో పాటు




ఆయనకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) ప్రభుత్వం అప్పగించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వైఖోమ్ నిడియా దేవి నియమితులయ్యారు. జిల్లా పరిపాలనలో కీలకమైన రెవెన్యూ మరియు అభివృద్ధి పనులను ఆమె పర్యవేక్షించనున్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా శుభమ్ నోఖ్వాల్ కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన దృష్టి సారించనున్నారు. అదేవిధంగా, వెనుకబడిన పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా వైశాలి నియమితులయ్యారు. ఇక బదిలీ అయిన బచ్చు స్మరణ్ రాజ్ ను సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తదుపరి పోస్టింగ్ ఇచ్చే వరకు ఆయన జీఏడీ పరిధిలో ఉండనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరిపాలనా యంత్రాంగంలో మరింత వేగాన్ని పెంచే క్రమంలో ప్రభుత్వం ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స

**అమరావతి, ఏప్రిల్ 18:** ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. పది రోజులు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. శుక్రవారం ఉదయం పాలనా పరమైన అంశాలపై అధికారులతో చర్చిస్తున్న సమయంలో పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వ్యక్తిగత వైద్యుల సలహాతో కార్యక్రమాలను రద్దు చేసుకున్న ఆయన ఆస్పత్రికి వెళ్లారు. పలు వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేశారు. కనీసం 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, దీర్ఘకాలం పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. పూర్తి స్వస్థత చేకూరేందుకు కాస్త ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ అపోలోలో ఆయన ముక్కుకు శస్త్రచికిత్స జరిగినట్లు తెలుస్తోంది.



# మహిళలను మోసం చేయడంలో కాంగ్రెస్ ఫస్ట్

మొదటి పేజీ తరువాయి

నాయుడు, కందుల దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలు సరిగా చేయలేరని కొందరు విమర్శిస్తున్నారని, ఆడబిడ్డలే మగవారికంటే ఎక్కువగా సంపాదిస్తున్నారంటే అది మహిళల శక్తి కాదా అని అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలకు చేయూతనిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్, మిత్రపక్షాలు సహకరిస్తే మహిళా బిల్లు ఆమోదం పొందేది. మహిళా బిల్లును ఎందుకు ఆమోదించలేదో చెప్పాలని విపక్షాలను నిలదీస్తున్నా. 1996లో దేవెగౌడ హయాంలో బిల్లుకు కాంగ్రెస్ మద్దతిచ్చినా వాళ్లు ఒప్పుకోలేదు. ఆ తర్వాత నాలుగుసార్లు బిల్లు వచ్చినా ఆమోదం పొందకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. యూపీఏ హయాంలో రాజ్యసభలో బిల్లు ఆమోదించారు. రాజ్యసభలో భాజపా సమర్థించింది.. మరి అప్పుడు లోక్‌సభలో ఎందుకు తీసుకురాలేదు. అప్పుడే లోక్‌సభలో తీసుకువచ్చి ఉంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కేది కదా అని ఆన్నారు. 2023లో మహిళా బిల్లు వచ్చినా.. 2026లో జనగణన జరగాల్సి ఉంది. జనగణన, డీలిమిటేషన్ తర్వాత మహిళా బిల్లుపై ముందుకెళ్లాలి. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. వాజ్‌పేయీ హయాంలో 1971 జనాభా లెక్కల ప్రకారం ముందుకెళ్లారు. ప్రజలను తప్పుదోవ పట్టించి మహిళలకు రిజర్వేషన్లు దక్కకుండా చేశారు. ఇది దేశద్రోహం.. మహిళలకు చేసిన దగా, మోసమని హెచ్చరిస్తున్నా అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సాధికారతలో ఏపీ ముందంజలో ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహిళలకు



చట్టసభల్లో రిజర్వేషన్లు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే కాంగ్రెస్ అడ్డుపడిందని పేర్కొన్నారు. ఈ పోరాటానికి దేశవ్యాప్త నిరసన నిడదవోలు నుంచి మొదలైందని తెలిపారు. నిడదవోలు పర్యటన చరిత్రలో నిలిచిపోతుందని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో తీసుకువచ్చారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ఈ బిల్లు అమల్లోకి రావాలంటే, 2026లో జనగణన జరగాల్సి ఉందని తెలిపారు. అలాంటి బిల్లుకు ఇండియా కూటమి నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేదని నిలదీశారు. దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుతో నష్టం జరుగుతోందని ఇండియా కూటమి నేతలు అంటున్నారని.. ఈ విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పారని తెలిపారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనకు బాధ వేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, సమాన ఆస్తి హక్కును దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు కల్పించారని ఉద్ఘాటించారు. ఏపీ డ్వాక్రా మహిళలు దేశ వ్యాప్తంగా నెంబర్ వన్‌గా పనిచేస్తున్నారని ప్రశంసించారు. వరకట్న సమస్య పోయిందని చెప్పుకొచ్చారు. ఆడబిడ్డలే భర్త కంటే ఎక్కువ సంపాదిస్తున్నారంటే, అది ఆడబిడ్డల శక్తి అని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అనుకుని ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో పాసయ్యేదని.. కానీ ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఈ నాటిది కాదని చెప్పుకొచ్చారు. మహిళలకు ఎప్పుడు న్యాయం చేయని పార్టీ, ద్రోహం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. మహిళలకు రిజర్వేషన్లు వచ్చేవరకు

# వచ్చే ఏడాదే గోదావరి పుష్కరాలు

- అమరావతి రైతుల త్యాగం మరువలేనిది
- రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటోంది
- మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు



**నిడదవోలు, ఏప్రిల్ 18:** గోదావరి పుష్కరాలను వచయ్యే యేడు బ్రహ్మాండంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అప్పటిలోగా పోలవరం పూర్తి చేస్తామని అన్నారు. గోదావరి పుష్కరాలను మూడోసారి నిర్వహించే అదృష్టం తనకే దక్కిందని అన్నారు. పుష్కరాల కంటే ముందుగానే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో, 2024లో వచ్చిన మెజార్టీ ఎప్పుడూ చూడలేదని ప్రస్తావించారు. తెలిపారు. అమరావతి రాజధానిగా కేంద్రం ఓ బిల్లు తెచ్చిందని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం మరువలేనిదన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో అన్న క్యాంటీన్లు మూసేసి, పేదలకు అన్నం లేకుండా చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో గొడ్డలి పార్టీ ఉందని.. పేదల సమస్యలు పట్టవని ధ్వజమెత్తారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టడానికి జగన్ అండ్ కోకు మనసొప్పదని విమర్శించారు. పేదలకు అన్నం పెట్టలేని పార్టీలు ఉన్నా ఒక్కటే.. లేకున్నా ఒక్కటేనని ఆగ్రహించారు. అందరినీ నరుకుతామని చెప్పి, నరబలి ఇస్తామని ఆ పార్టీ శ్రేణులు అంటున్నాయని దుయ్యబట్టారు. ఇక్కడ ఉన్నది 1995 సీబీఎన్.. ఆ గొడ్డలి పార్టీ ఆగడాలను సాగనివ్వనని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డలను చట్టసభల్లో చూడాలనేదే తన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. మహిళలకు వ్యతిరేకంగా పనిచేసే పార్టీలు మనుగడ సాగించలేకుండా చేయాలని అన్నారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని బాగు చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఎన్నికల ముందు చెప్పానని తెలిపారు. 'మన ఇల్లు - మన వీధి - మన ఊరు' అనే ఆలోచన ప్రజలకు రావాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర కోసం 15 నెలలుగా కష్టపడుతున్నానని పేర్కొన్నారు. ఈ శనివారం 'జలధార జలహారతి' అనే థీమ్‌తో ముందుకు వచ్చానని.. వంద రోజులు కార్యాచరణతో పనిచేస్తానని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రంలో నూటికి నూరు శాతం చెత్తను సేకరించే బాధ్యతను తీసుకుంటామని తెలిపారు. చెత్తే మన సమస్య.. మన ఆరోగ్యానికి సమస్య అని చెప్పారు. 13 నగరాల్లో స్వీపింగ్ యంత్రాలు తెస్తున్నామని.. టెండర్లు పిలిచామన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ప్రతీనెల పేదల సేవలో 60 లక్షల మందికి, ఏడాదికి రూ.33వేల కోట్లతో పెన్షన్లు ఇస్తున్నామని వివరించారు. అక్వాకల్చర్‌ను పరిశ్రమగా తీసుకెళ్లాలని సూచించారు. అక్వా కల్చర్‌తో కొంత కాలుష్య సమస్యలు వస్తున్నాయని ప్రస్తావించారు. ఆ కాలుష్యం లేకుండా చర్యలు తీసుకుని, అక్వాను అభివృద్ధి చేస్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నిడదవోలు పర్యటనలో తక్కువ అభివృద్ధి చూపించిన శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఆకస్మిక తనిఖీలకు వస్తానని తెలిపారు. బాగా పనిచేస్తే అభినందిస్తానని.. లేకపోతే పని నేర్పిస్తానని.. అప్పటికీ బాగాలేకపోతే.. ఇక బాగుండదని హెచ్చరించారు. అధికారులు, తాను ప్రజలకు సేవకులం మాత్రమేనని.. పెత్తందార్లం కామని స్పష్టం చేశారు. కొన్ని శాఖలకు వ్యసనాలు ఉన్నాయని.. ఆ వ్యసనాలు పోవాలని సీఎం చంద్రబాబు మందలించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్‌లు

# రాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

- నటుడి వ్యాఖ్యలపై తీవ్ర దుమారం
- మండిపడ్డ జనసేన నేత నాగబాబు
- విశ్వహిందూ పరిషద్ తీవ్ర హెచ్చరిక
- ప్రకాశ్ రాజ్‌పై వందకోట్లకు టీటీడీ బోర్డు పరువు నష్టం

**అమరావతి, ఏప్రిల్ 18:** ఇటీవల కేరళ సాహిత్యోత్సవంలో ప్రకాశ్ రాజ్ రామాయణం గురించి చేసిన వ్యాఖ్యలు చినికి చినికి గాలివానగా మారుతున్నాయి. రాముడు ఉత్తరా ది కూలీ అని, దక్షిణాదికి వలస వచ్చాడని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పలు ప్రాంతాలలో ఆయనపై రామభక్తులు కేసులు వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సైతం ప్రకాశ్ రాజ్‌పై పరువునష్టం దావా వేసి, లీగల్ నోటీసులు పంపారు. ఆయన సహ నటీనటులు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యల ను ఖండిస్తున్నారు. మరికొందరైతే ప్రకాశ్‌రాజ్ నటిస్తున్న సినిమాలను బాయ్‌కాట్ చేయాలని పిలుపునిస్తున్నారు. ప్రకాశ్ రాజ్‌ను సినిమాల నుండి తొలగించాలని సోషల్ మీడి యా వేదికగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ నటుడు, నిర్మాత, జనసేన శాసనమండలి సభ్యులు నాగబాబు సైతం ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. ట్విట్టర్ వేదికగా ఆయన తన మనసులోని భావాలను వ్యక్తం చేశారు. 'శ్రీరాముడు కేవలం హిందువుల దేవుడు మాత్రమే కాదు. ఆయన ధర్మానికి ప్రతీక. ఆయనను అవమానించడం లేదా తగ్గించాలని చూడటం ధైర్యం కాదు... అహంకారం! మానసిక అంధత్వం వల్ల జరిగే పొరపాటు అది' అని అన్నారు. రాముడిని ఎగతాళి చేసేవారు తమని తాము నష్టపర్చుకుంటున్నారని, అజేయమైన ధర్మాన్ని కాపాడే శక్తులు నిరంతరం పని చేస్తుంటాయని నాగబాబు



అభిప్రాయ పడ్డారు. చరిత్రలో న్యాయానికి వ్యతిరేకంగా నిలిచినవారు పతనమయ్యారని, అదే విధంగా రాముడిపై విషం చిమ్మే వారి భవిషత్తు కూడా అదే అవుతుందని నాగబాబు అన్నారు.

### బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

సినీ నటుడు ప్రకాష్ రాజ వ్యాఖ్యలపై విశ్వ హిందూ పరిషత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. హిందూ సమాజానికి ప్రకాష్ రాజ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. క్షమాపణలు చెప్పకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది. అమరావతిలో మీడియాతో మాట్లాడిన విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవికుమార్, సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రకాష్ రాజ్ తన వ్యాఖ్యలతో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు.. ప్రకాష్ రాజ్ జాతీయతకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, దేశ భావజాలాన్ని అవమానించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు సత్యరవకుమార్.. ఆయన ప్రవర్తన హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉందని అన్నారు. శ్రీరాముడిని అవమానించినందుకు హిందువులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వీహెచ్‌పీ స్పష్టం చేసింది. లేనిపక్షంలో ఃజీతీసజీనిణ ఆజీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది. ప్రకాష్ రాజ్‌పై హిందూ సమాజం మొత్తం కలిసి క్రిమినల్ కేసులు వేస్తామని, ఆయన సినిమాలను బహిష్కరించాలని కూడా పిలుపునిచ్చారు. దర్శకులు, నిర్మాతలు, ఇతర హీరోలు తమ సినిమాల్లో ప్రకాష్ రాజ్‌కు అవకాశాలు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రకాష్ రాజ్ నుంచి దీనిపై స్పందన రావాల్సి ఉంది.

### వందకోట్లకు పరువు నష్టం దావా

నటుడు ప్రకాశ్ రాజ్‌పై టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి పరువు నష్టం దావా వేశారు. రామలక్ష్మణులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నటుడు ప్రకాశ్ రాజ్‌పై రూ.100 కోట్లకు దావా వేశారు. భాను ప్రకాశ్ తరఫు న్యాయవాది.. ప్రకాశ్ రాజ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. హిందువుల మనోభావాలు కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేశారని భాను ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లోగా హిందువులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో రామ లక్ష్మణులపై ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. రామలక్ష్మణులు ఉత్తరభారతదేశం నుంచి వచ్చిన వలస కూలీలు అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరభారత దేశానికి చెందిన రామలక్ష్మణులు.. దక్షిణాదికి చెందిన రావణుడి పొలంలో పండ్లను దొంగతనం చేశారని అన్నారు. అయితే రామలక్ష్మణులను వలస కూలీలు అంటూ ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు


# చేవెళ్లలో 22 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

- గౌరవప్రదమైన పెళ్లికి ప్రభుత్వ సాయం - కళ్యాణ లక్ష్మితో ఆడపిల్లలకు భరోసా
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా రూ. 22,00,352 చెక్కుల పంపిణీ
- చేవెళ్ల మండలం, మున్సిపాలిటీ పరిధిలో 22 మందికి లబ్ధి
- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండ - ఎమ్మెల్యే యాదయ్య
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో ఆడపిల్లల జీవితాల్లో ఆనందం



**చేవెళ్ల, ఏప్రిల్ 18 (సమయం న్యూస్):** "ఆర్థిక ఇబ్బందులు ఉన్న కుటుంబాలకు గౌరవప్రదమైన పెళ్లి కోసం ప్రభుత్వం అందించే సహాయం కళ్యాణ లక్ష్మి" అని చేవెళ్ల శాసన సభ్యులు శ్రీ కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల మండలం మరియు మున్సిపాలిటీకి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 22 మంది లబ్ధిదారులకు రూ. 22,00,352 విలువైన చెక్కులను స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుం బాల ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో ఆనందం నింపేందుకు ఈ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడల్ ప్రశ్న పత్రాల సాధన ద్వారా సివిల్స్ లో విజయం సాధ్యం!






**హైదరాబాద్ ఏప్రిల్18( సమయం న్యూస్) :** మన లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎన్ని కష్టాలు, ఆటంకాలు ఎదురైనా, వాటిని అధిగమించి మన కలను నెరవేర్చుకునే విధంగా మనల్ని మనం దృఢపరచు కోవాలని, మనలోని అంతర్గత శక్తులను ప్రేరేపించుకుని గమ్యం వైపు అడుగులు వేయాలని, సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్ లో విజయం సాధించడానికి ప్రిలిమ్స్ తొలిమెట్టు అయితే, అందులో వచ్చే ప్రశ్నలని సరిగా అర్థం చేసుకొని ఇచ్చిన నాలుగు ఆప్షన్స్ లోంచి సరైన సమాధానాన్ని కనుక్కోవడానికి విస్తృత అధ్యయనమే మార్గమని, సిలబస్ కనుకూలంగా వివిధ పాఠ్యాంశాలను చదవడం మాత్రమే కాకుండా వాటిని సక్రమంగా గుర్తుపెట్టుకోవడం, సరైన సమయంలో వాటిని స్మరణ చేసుకోవడం అవసరమని, దీనికోసం నిరంతరం వివిధ మోడల్ టెస్టులను సాధన చేయడం ద్వారా అభ్యర్థులలో ఆత్మవిశ్వాసం, విషయ అవగాహన, పరీక్ష ప్రశ్నలని ఎదుర్కొనే వ్యూహం పెరుగుతాయని దైనంపల్లి ప్రవీణ్ అన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 పోటీ పరీక్షలలో విజయం సాధించి డీఎస్పీగా పోలీసుశాఖకు ఎంపికై ప్రస్తుతం అకాడమీలో శిక్షణ పొందుతూ, సివిల్ సర్వీసెస్ 2025 పరీక్షలలో మంచి ర్యాంకు సాధించి విజేతగా నేటి తెలంగాణ యువతకు ఆదర్శంగా నిలిచాడు. మే 24 నాడు జరగబోయే సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ప్రయోగాత్మకంగా ప్రారంభించిన "సంకల్ప సాధన దీక్ష" లో భాగంగా ఈరోజు సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్ లో ప్రవీణ్ కుమార్ ప్రసంగాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ప్రిలిమినరీ పరీక్షల్లో అభ్యర్థులు పాటించాల్సిన వ్యూహం, పరీక్షను అర్థం చేసుకునే విధానం, ప్రశ్నలన్నీ విశ్లేషించే తీరు, సమయపాలన లాంటి అంశాలపై ఆయన ఎన్నో విలువైన సూచనలు, తన అనుభవాలు, ఉదాహరణలతో సహా వివరించడం అభ్యర్థులకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది.

**పరీక్ష హాల్ లో మానసిక సన్నద్ధతే కీలకం ::** ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తెలంగాణ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం ఒక స్వప్నం అని, అలాంటి ప్రభుత్వ ఉద్యోగాలలో శిఖరం లాంటి ఉద్యోగాలు సివిల్ సర్వీసెస్ అని, అలాంటి సివిల్ సర్వీసెస్ ని సాధించే కలని సాకారం చేయడంలో బిసి స్టడీ సర్కిల్ నాణ్యమైన శిక్షణని, విజేతలైన వ్యక్తుల మార్గదర్శకత్వంలో నిర్వహిస్తూ వస్తుందని, అందులో భాగంగానే ప్రవీణ్ ను ఆహ్వానించి ఈ ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అదే సందర్భంలో ప్రిలిమినరీ టెస్ట్ అర్హత సాధించడంలో ఎగ్జామినేషన్ హాల్ మేనేజ్మెంట్ కీలకంగా ఉంటుందని, మూడు గంటల కాలంలో అభ్యర్థి ఎలాంటి ఆందోళనలు, అనుమానాలు, సందేహాలు లేకుండా ఆత్మవిశ్వాసంతో ఈ ప్రశ్నలన్నీ చదివి అర్థం చేసుకుని సరైన సమాధానాలని గుర్తించడం లోనే విజయావకాశాలు ఉంటాయని, ఆటంకాలు ప్రతిబంధకాలు, కష్టాలు సాకు చెప్పి మన లక్ష్యాన్ని సాధించే క్రమంలో డీలా పడకూడదని, అలా మొక్కవోని దీక్షతో అచంచల విశ్వాసంతో ముందుకెళ్ళినప్పుడే విజయం సాధిస్తామని దానికి నిలువెత్తు ఉదాహరణ ప్రవీణ్ కుమార్ అని మామిడి హరికృష్ణ అన్నారు. స్టడీ సర్కిల్ అభ్యర్థులకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు సౌకర్యాలను కూడా అందిస్తూ, ప్రతిరోజు మోడల్ టెస్ట్ ని కూడా నిర్వహిస్తూ, అభ్యర్థులలో ధైర్యాన్ని నింపుతూ, సందేహ నివృత్తి చేస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నామని, సివిల్ సర్వీసెస్ లో విజయం సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను మానసికంగా, వైజ్ఞానికంగా, మేధోపరంగా సంసిద్ధం చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

# తెలంగాణ వక్ఫ్ బోర్డు సమస్యపై ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారిని కలిసిన కాలనీ సంఘాలు



**మల్కాజిగిరి ఏప్రిల్18( సమయం న్యూస్). :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు సమస్యపై, ప్రభావిత ప్రాంతాల కాలనీ సంఘాల ప్రతినిధులు ఈ రోజు (18-04-2026) ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారిని ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు.

2024 సంవత్సరంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు పొరపాటున మల్కాజిగిరి పరిధిలోని సర్వే నంబర్లు 3, 103, 104, 105 మరియు 144 నుండి 154 వరకు 22=ూ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరెడ్మెట్, రాంబ్రహ్మనగర్, దేవినగర్ ఎక్స్టెన్షన్, దేవినగర్, సైనిక్ నగర్, సీతారాం నగర్ మరియు కృష్ణా నగర్ ప్రాంతాలు కూడా ఉండడంతో, ఆ ప్రాంతాలలో ఆస్తుల కొనుగోలు-అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఆంధ్రప్రదేశ్ గెజెట్ నం. 35 పార్ట్-×× (27.08.1987) మరియు గెజెట్ నం. 37 పార్ట్-×× (13.10.2001) ప్రతులను పరిశీలించగా, అలాగే హైకోర్టులోని జ.=ూ. నం. 5057/2008 కేసు ఆధారంగా, సంబంధిత సర్వే నంబర్లు మల్కాజిగిరికి కాకుండా ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందినవని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో కాలనీ సంఘాల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు ఇప్పటికే రెండు సార్లు తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ మరియు సీఈఓలను కలిసి సమస్యపై చర్చించారు. ఈ రోజు జరిగిన సమావేశంలో కాలనీ వాసులు తమ ఆందోళనలను వ్యక్తం చేయగా, ఎమ్మెల్యే గారు స్పందిస్తూ --- మల్లాపూర్‌కు చెందిన సర్వే నంబర్లు పొరపాటున మల్కాజిగిరి పరిధిలో వక్ఫ్ జాబితాలో చేర్చబడినవని, వాటిని వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ విషయమై ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు గారిని కలసి, వక్ఫ్ బోర్డు సీఈఓతో మాట్లాడించినట్లు వివరించారు. ఈ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే గారు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ విద్యానగర్, ఓల్డ్ నేరెడ్మెట్, రాంబ్రహ్మనగర్, దేవినగర్ ఎక్స్టెన్షన్, దేవినగర్, సైనిక్ నగర్, సీతారాం నగర్ మరియు కృష్ణా నగర్ ప్రాంతాలకు చెందిన ఆస్తి యజమానులు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మృతి చెందిన కొప్పుల రావులమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం.

- వారి కుటుంబానికి అండగా ఉంటాం కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి



**యాలాల మండలం, ఏప్రిల్,18(సమయం న్యూస్) :** తాండూర్ నియోజక వర్గంలోని యాలాల మండల కేంద్రంలో కొప్పుల రాములమ్మ మరణవార్త తెలియగానే యాలాల మండల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యానీయడం జరిగింది. పేరి రాజేందర్ రెడ్డి అదేశాలమేరకు గ్రామ సర్పంచ్ సి. హెచ్ శివయ్య,ఎ ఎం సి డైరెక్టర్ గోనెగారి శ్రీనివాస్ (చిన్న), ఉప సర్పంచ్ శోభా రాజు రెడ్డి,కె.వి.పి.ఎస్ జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప,వార్డ్ నెంబర్లు. మలిగేరినర్సమ్మ, మలిగేరి నర్సిములు,శివకూమర్,నర్సిములు, డాన్ శ్రీను,బాగాని రాజు,తదితరులు వారి కుటుంబానికి ప్రగాఢ సానూభూతి తెలుపుతూ అందరితో కలిసి ఆర్థిక సహాయం అందించారు.

# ఎన్. రాంచందర్ రావు హౌస్ అరెస్ట్



**హైదరాబాద్ ఏప్రిల్18( సమయం న్యూస్) :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌పై ఆందోళనకు సిద్ధమైన బీజేపీ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చిన రాంచందర్ రావును ఆయన నివాసం వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ---"నారీ శక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్‌ను వదిలిపెట్టం" అని పేర్కొన్నారు.

# ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యార్థులతో బలవంతంగా అండర్‌టేకింగ్ లేఖలు రాయింపు

- వై. సతీష్ రెడ్డి ఆరోపణలు

**హైదరాబాద్ ఏప్రిల్18( సమయం న్యూస్). :** ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులతో బలవంతంగా అండర్‌టేకింగ్ లేఖలు రాయించుకుంటున్నాయని బీఆర్ఎస్ నాయకుడు, రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం చేతులెత్తేసి పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కాలేజీలు విద్యార్థులతో మూడు నెలల్లో ఫీజులు చెల్లిస్తామని లేఖలు రాయించుకుంటున్నాయని తెలిపారు. జూలైలోపు ఫీజు చెల్లించకపోతే పరీక్ష ఫలితాలు నిలిపివేయడం, తదుపరి సంవత్సరంలో తరగతులకు అనుమతి ఇవ్వకపోవచ్చని బెదిరింపులు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికే సుమారు 13 లక్షల మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక సర్టిఫికేట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తాజాగా మరో 10 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు కూడా అనిశ్చితిలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు పూర్తిగా చెల్లిస్తేనే పరీక్షలు రాయనిస్తామని పాత విద్యార్థులను, అలాగే పూర్తి ఫీజు కడితేనే కొత్త అడ్మిషన్లు ఇస్తామని కాలేజీలు ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. ఈ పరిస్థితుల వల్ల పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి్. ూ. =ఖ-ఝింవఎష్ఘ్ఘతీఖ =వ౹ు౹ుఎ ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని, అలాగే ఖ. జష్ఘ్ఘఅసతీఖంష్ట్రవఝితీ =ఖశీ కొనసాగించిన విధానాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి =వఝుత్ష్ట్ర =వ౹ు౹ుఎ ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేద విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, లేకపోతే విద్యార్థుల పక్షాన ఉద్యమాలు చేపడతామని వై. సతీష్ రెడ్డి హెచ్చరించారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్న ఖాజీపూర్ గ్రామ సర్పంచ్-యం.సాయప్ప

- గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత అని,
- ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి -సర్పంచ్



**మద్దూర్ మండలం, ఏప్రిల్,18(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ సర్పంచ్ స్వయంగా డ్రైనేజ్ శుభ్రం చేయడం జరిగింది. ఖాజీపూర్ గ్రామంలో 1వార్డు లో డ్రైనేజీలు మూసుకుపోవడంతో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో,సర్పంచ్ యం. సాయప్ప వార్డు మెంబర్ బి.శాంత్ కుమార్ ముందడుగు వేసి స్వయంగా శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికులతో కలిసి డ్రైనేజీలోకి దిగిమరి. మురుగు తొలగించడం ద్వారా గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు కూడా ఈ చర్యను అభినందిస్తూ, ఇలాంటి నాయకత్వం వల్ల గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గోవిందు,ఉప సర్పంచ్,మరియు సి.బీములు,యండి.ఖాజా,యం.లాలు,పారిశుద్ధ కార్మికులు వెంకటప్ప,నరేశ్,పాల్గొన్నారు

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- మహిళల భద్రత కు అండగా "షీ" టీమ్
- పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు
- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్,డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశానుసారం




**కొడంగల్ మున్సిపల్ (మం),ఏప్రిల్,18(సమయం న్యూస్) :** మహిళల భద్రత కోసమే "షీ" టీమ్ నిరంతరం పనిచేస్తుందని పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు తెలిపారు.శనివారం కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని గల్స్ హాస్టల్ లో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు హాస్టల్ విద్యార్థిని లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ మాట్లాడుతూ... మహిళలు బాలికలకు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ద్వారా ఏర్పరిచిన టోల్ ఫ్రీ 8నెంబర్లు 100, 181 ను సంప్రదించాలని అన్నారు. అదేవిదంగా మొబైల్ వాడకం దారులు అనుకొని పరిస్థితులలో సైబర్ క్రైమ్ లో మోసపోయినట్లు గుర్తించిన వెంబడి టోల్ ఫ్రీ నెంబర్ 1930కు తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అంతే కాకుండా మహిళలు బాలికలు టి-సేఫ్ యాప్ ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలన్నారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ, తదితర అంశాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గల్స్ హాస్టల్ వార్డెన్ వరలక్ష్మి ఉపాద్యాయులతో,విద్యార్థినిలు, పాటు "షీ" టీమ్ సభ్యులు బి.సావిత్రి శోభ,తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ మహిళా మోర్చా యత్నం

**హైదరాబాద్ ఏప్రిల్18( సమయం న్యూస్,) :** జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ మహిళా మోర్చా ప్రయత్నించింది. వీరి రాక గురించి ముందుగానే తెలిసిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి నేతృత్వంలో వచ్చిన మహిళా కార్యకర్తలను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, మహిళా మోర్చా నేతలకు మధ్య కాసేపు తీవ్రతోపులాట, వాగ్వాదం జరిగింది. పోలీసులు కార్యకర్తలను అరెస్ట్ చేసి స్థానిక స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మహిళా మోర్చా నేతలు నినాదాలు చేశారు.

# రేవంత్ రెడ్డి పోవాలి కే సి ఆర్ రావాలి.

- మాజీ మంత్రి హరీష్ రావు.
- కే స్ ఆర్ బహిరంగవసభ ఏర్పాట్ల ను పరిశీలించిన కే టి ఆర్ హరీష్ రావు.

**జగిత్యాల,18( సమయం న్యూస్)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు, మాజీ మంత్రి టి. హరీశ్ రావు జగిత్యాలలో పర్యటించారు. కాంగ్రెస్ సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి ఈ నెల 20న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు.జీవన్ రెడ్డి చేరికతో కరీంనగర్‌తో పాటు ఉత్తర తెలంగాణ మొత్తం ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజల్లో స్పష్టమైన అభిప్రాయం ఏర్పడిందని, "అనుముల రేవంత్ రెడ్డి పోవాలి -- కేసీఆర్ రావాలి" అనే నినాదం విస్తృతంగా వినిపిస్తోందని తెలిపారు.పార్లమెంట్‌లో ఇటీవల జరిగిన పరిణామాలు తెలంగాణ సమాజాన్ని కలచివేశాయని, తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును ఇండియా--పాకిస్తాన్ విభజనతో పోల్చడం తీవ్ర అవమానకరమని హరీశ్ రావు మండిపడ్డారు. వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను సమర్థించే ప్రయత్నం చేసిన జి. కిషన్ రెడ్డి వైఖరిని కూడా ఆయన తీవ్రంగా ఖండించారు.

తెలంగాణ రాష్ట్రం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. అవగాహన లేకుండా బీజేపీ నేతలు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.లోక్‌సభలో తెలంగాణకు చెందిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు స్పందించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే తగిన సమాధానం ఇచ్చేవారని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీతో దగ్గర సంబంధాలు కొనసాగిస్తున్నారని, "బడే భాయ్ -- చిన్న భాయ్" బంధం బయటపడిందని ఆరోపించారు. డీలిమిటేషన్‌పై చెప్పిన హైబ్రిడ్ విధానం అసలు "క్రాస్ బ్రీడ్" రాజకీయమని విమర్శించారు.

మహిళా రిజర్వేషన్ల బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేశాయని హరీశ్ రావు ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే చట్టబద్ధత కల్పించాల్సిందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ మాత్రం మహిళా రిజర్వేషన్ల విషయంలో ముందుండి పనిచేసిందని, కేసీఆర్ నాయకత్వంలో తొలి తెలంగాణ శాసనసభలోనే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు.

# 3 సం.||ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**కరీంనగర్ ఏప్రిల్18( సమయం న్యూస్). :** మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థ హైదరాబాద్ నందు 3 సం.||ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు 2026-2027 విద్యాసంవత్సరానికి గానూ తల్లిదండులను కోల్పోయిన అనాధ బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుండి డిప్లొమా కోర్సులకు(సివిల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్,కంప్యూటర్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్,సెమీ కండక్టర్ టెక్నాలజీ,లాండ్‌స్కేప్ డిజైన్) దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

ప్రతి కోర్సులో 60 సీట్లకు గానూ మొత్తం 360 సీట్లలో 70 శాతం తల్లిదండులు కోల్పోయిన(అనాధ) బాలికలకు కేటాయించబడును. అంతేకాకుండా ఇట్టి బాలికలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని ఱ 3శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించడం జరిగింది. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతిని కూడా కల్పించబడును. దరఖాస్తు కొరకు కులం (అనాధ బాలికలకు అవసరం లేదు), ఆదాయ ధృవీకరణ (అనాధ బాలికలకు అవసరం లేదు), మరణ ధృవీకరణ పత్రములు 4. బోనాఫైడ్ పత్రములను బాల రక్ష భవన్ (జిల్లా బాలల పరిరక్షణ విభాగం)-9490881098, జిల్లా పరిషత్ కార్యాలయంలోని 2వ అంతస్తు లభించే దరఖాస్తు ఫారానికి సంబంధిత ధృవపత్రములను జతచేసి మే 23, 2026 లోగా దరఖాస్తులను సమర్పించాలని శ్రీమతి.యం.సరస్వతి,జిల్లా సంక్షేమ అధికారి గారు ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మేడ్చల్ ఏప్రిల్18( సమయం న్యూస్) :** ఈరోజు మల్కాజ్‌గిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ శ్రీ మాను చౌదరి, ఐఏఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం వివిధ అంశాలపై వినతి పత్రాలను కలెక్టర్ గారికి సమర్పించారు.

**చర్చించిన ముఖ్య అంశాలు:**

రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22–ూ కింద ఉన్న నిషేధిత ఆస్తుల జాబితాను పునఃసమీక్షించి, వక్ఫ్ బోర్డు పేరుతో తప్పుగా నమోదైన లీగల్ హౌస్ ప్రాపర్టీలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

మల్కాజ్‌గిరిలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

సఫిల్‌గూడలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ఖూ౧ఙ) నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలి.

విమలాదేవి నగర్‌లోని ప్రజా వినియోగ భూమి (స్టింగ్ వెల్ ) బావి పై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలను వెంటనే అరికట్టాలి.

అల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రం కోసం కేటాయించిన గ్రామకంఠం ప్రభుత్వ భూమిని రక్షించాలి.

మల్కాజ్ గిరి నియోజకవర్గంలో నిర్మాణంలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి.

షెడ్యూల్డ్ కాస్ట్ ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ కింద లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలి.

అల్వాల్‌లోని సఖి సెంటర్‌కు అదనపు అంతస్తు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలి.

ఆర్‌కే పురం =ాదీ ఱ =ఖదీ పనుల వల్ల ప్రభావితమైన 18 మంది బీపీఎల్ పేద కుటుంబాలకు 2దీ౧ఖ ఇళ్లను కేటాయించాలి.

సీతారాం నగర్ కాలనీలో సర్వే నంబర్లు 109 ఱ 111లపై ప్రవేట్ వ్యక్తులు చేస్తున దక్రమ దావాలు, ప్రజలపై వేధింపులను అరికట్టాలి.

కౌకూర్ దర్గా నుండి బిట్స్ పిలాని వరకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలి.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యంత అవసరమని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ శ్రీ మాను చౌదరి గారు ఎమ్మెల్యే గారి వినతులను సానుకూలంగా స్వీకరించి, అన్ని అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య జనరల్ సెక్రెటరీ బి.టి. శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, డోలి రమేష్, లక్ష్మణ్ యాదవ్, హేమంత్ పటేల్, కేబుల్ రమేష్, సంపత్ యాదవ్, శివ గౌడ్, సాయి గౌడ్, మల్లేష్, జనార్ధన్ తదితర నాయకులు, కార్యకర్తలు, యువకులు మరియు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎలక్షన్ సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు-ఎస్పీ



**మక్తల్ మున్సిపల్, ఏప్రిల్,18(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా, మక్తల్ మున్సిపాలిటీలో ఆరో వార్డు మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. శనివారం రోజున మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని చందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ స్వయంగా సందర్శించి, ఎన్నికల సరళి మరియు పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులతో మాట్లాడిన ఎస్పీ, పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా సాగాలని సూచించారు. గతంలో ఆరో వార్డు ఎన్నికల అభ్యర్థి మరణం కారణంగా ఈ వార్డుకు తిరిగి ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వృద్ధులు, మహిళలు మరియు దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు.ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా పోలీసు శాఖ హై అలర్ట్‌లో కొనసాగాలని, శాంతి--భద్రతలను కాపాడడంలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు కూడా సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి తోడ్పడాలని కోరారు.మక్తల్ సీఐ రామ్ లాల్,ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తదితరులు, పోలీసు సిబ్బంది ఈ పరిశీలనలో పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....అవగాహన కల్పించిన SFO పి. ప్రభాకర్

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన






**కొడంగల్ మున్సిపల్, ఏప్రిల్,18(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో శనివారం తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫైర్ సేఫ్టీ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కొడంగల్ అగ్నిమాపక అధికారి పి. ప్రభాకర్ హాజరై అగ్ని ప్రమాదాల నివారణకై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొన్నిసార్లు చిన్న పొరపాట్లే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. బీడీ, సిగరెట్, అడవుల్లో వంట చేయడం, రైతులు పొలాల్లో మంటలు వేయడం వంటి ఆవాంఛిత చర్యల వల్ల భూసారం తగ్గడమే గాక అడవులు దగ్ధమై వనసంపద నశించి జంతుజాలానికి తీరని నష్టం జరిగే ప్రమాదముందన్నారు. ఇంకా ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగ విధానాన్ని ప్రదర్శించారు మరియు వంట గ్యాస్ లీకైన సందర్భంలో ప్రమాద నివారణ గూర్చి వివరించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు యం. హరిప్రియ, డా. వి. శ్రీధర్ కుమార్, అగ్నిమాపక సిబ్బంది ఎ. పవన్ కుమార్, కె. శివప్రసాద్,కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- అవినీతికి సహకరిస్తున్న ఉద్యోగులపై విచారణ చేపట్టాలి
- నంగారా భేరీ (ఎల్ హెచ్ పీఎస్) ఆధ్వర్యంలో అధికారులకు వినతి
- చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ



**ఖమ్మం, ఏప్రిల్ 18:( సమయం న్యూస్ )** గిరిజన గురుకుల విద్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై చర్యలు చేపట్టాలని, ఖమ్మం రీజియన్ అధికారి అరుణ కుమారితోపాటు అందులో సిబ్బంది నరేంద్ర, గణేష్ లపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. నంగారా భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితీ (ఎల్ హెచ్ పీఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సంబంధిత ఉన్నతాధికారులకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాణోత్ భద్రు నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా లాలు నాయక్ వినతి పత్రాలను అందజేశారు. ఈ అంశంపై గతంలో ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా లాలు నాయక్, భద్రు నాయక్ తెలిపారు. గురుకుల విభాగంలో తాత్కాలిక ఉద్యోగుల నియామకంలో గిరిజన నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో పాటు ట్రైబల్ వెల్ఫేర్ కమీషనర్ సంతోష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచీ ఘోష్ లకు వినతి పత్రాలు సమర్పించగా వారు సానుకులంగా స్పందించారని లాలు నాయక్, భద్రు నాయక్ ప్రకటించారు. వినతిపత్రలకు స్పందించిన అధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# కాలేయ ఆరోగ్యం కాపాడుకుందాం

**-- ఆరోగ్యకర జీవనశైలితో వ్యాధులకు చెక్**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 19న ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని జరుపుకుంటారు. కాలేయ వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు సరైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం.

మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో కాలేయం ఒకటి. ఇది శరీరంలోని విషపదార్థాలను తొలగించడం, రక్తాన్ని శుద్ధి చేయడం, పోషకాలను ప్రాసెస్ చేయడం, జీర్ణక్రియను మెరుగుపరచడం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తుంది. అదేవిధంగా రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో కూడా కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది.

అయితే, ఆధునిక జీవనశైలిలో పెరిగిన చెడు అలవాట్లు కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మద్యం సేవనం, ప్రాసెస్డ్ ఫుడ్స్ వినియోగం, అధిక కొవ్వు మరియు చక్కెరలతో కూడిన ఆహారాలు కాలేయ వ్యాధులకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**కాలేయానికి హానికరమైన ఆహారాలు**

ఆల్కహాల్,ప్రాసెస్డ్ ఫుడ్స్,అధిక కొవ్వు పదార్థాలు

షుగర్ అధికంగా ఉండే పానీయాలు

ప్యాకేజ్డ్ ఫుడ్స్,అధిక ఉప్పు,కాలేయానికి మేలు చేసే



ఆహారాలు

ఆకుకూరలు, తాజా కూరగాయలు,నట్స్,ఆలివ్ ఆయిల్.యాపిల్స్

బ్లూబెర్రీస్,బీట్‌రూట్,గ్రీన్ టీ,కాలేయ వ్యాధుల లక్షణాలు

ఎప్పటికప్పుడు అలసటగా అనిపించడం

కళ్లకు, చర్మానికి పసుపు రంగు (జాండిస్)

కుడి వైపు పొత్తికడుపులో నొప్పి

ముదురు రంగులో మూత్రం,వికారం, వాంతులు,ఈ లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.

**నిపుణుల సూచనలు....**

యోగ మరియు లైఫ్‌స్టైల్ నిపుణులు చెబుతున్నదాని ప్రకారం, అధికంగా చక్కెరతో కూడిన పానీయాలు తీసుకోవడం వల్ల కాలేయంపై భారం పెరుగుతుంది. దీనివల్ల 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (చీూఖీూణ)' వచ్చే ప్రమాదం ఉంది. గ్లూకోజ్ మాత్రమే కాకుండా ఫ్రక్టోజ్ కూడా కాలేయానికి హానికరమేనని వారు హెచ్చరిస్తున్నారు.

పండ్లలో కూడా ఫ్రక్టోజ్ ఉండటంతో వాటిని పరిమితంగా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్స్, వేపుళ్లు, షుగర్ డ్రింక్స్ తగ్గిస్తూ, మాంసాహారం మరియు మద్యం మితంగా తీసుకోవడం ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

**ముగింపు...**ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం --- ఇవే కాలేయాన్ని కాపాడే మూడు ప్రధాన ఆయుధాలు. ఈ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలి.

# రోడ్డు భద్రతా నియమాలు పాటిద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం

- ట్రాఫిక్ రూల్స్ పాటించడం మన సామాజిక బాధ్యత.
- జోగులాంబ జోన్-07 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ IPS
- రోడ్డు భద్రతపై కదం తొక్కిన నారాయణపేట జిల్లా పోలీసులు.
- హెల్మెట్ అవగాహనకు పట్టణంలో భారీ బైక్ ర్యాలీ.
- డిఫెన్స్ డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.







**నారాయణపేట, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం 'అరైవ్ అలైవ్' కార్యక్రమం కింద రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రజలు, వాహనదారులకు సందేశం అందించారు. ఈ ర్యాలీలో జోగులాంబ జోన్-07 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఞూూ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఞూూతో పాటు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, యు-ంవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ మార్కెట్ యార్డ్ నుంచి ప్రారంభమై అంబేద్కర్ చౌరస్తా, సత్యనారాయణ చౌరస్తా, యాద్గిర్ రోడ్డు, పాత బస్టాండ్, సెంటర్ చౌక్ మీదుగా శ్రీ గార్డెన్ వరకు కొనసాగింది. అనంతరం శ్రీ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 'ూతీతీఱఙవ-ూశ్రీఱఙవ' కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తేనే ఈ ప్రమాదాలను తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. వాహనదారులు తమ ప్రాణ భద్రత కోసం హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యార్థులు తమ తమ కుటుంబ సభ్యులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ... ప్రజలు ఇంటి నుండి వెళ్లి మళ్లీ సురక్షితంగా ఇంటికి చేరుకోవడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. యువత సమాజంలో మార్పు తీసుకురావడానికి ముందుకు రావాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ...నారాయణపేట జిల్లాలో ప్రతి సంవత్సరం 100కు పైగా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఈ సంఖ్యను తగ్గించాలంటే ప్రతి ఒక్కరు డిఫెన్స్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని, డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ప్రమాదాల నివారణలో కీలకమని తెలిపారు. 'అరైవ్ అలైవ్'కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరంతర అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ (వితౌట్ చాలన్)తో కేవలం అవగాహన కార్యక్రమం మాత్రమే నిర్వహిస్తున్నామని, వాహనదారులు స్వచ్ఛందంగా నియమాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీణ రియాజ్ హుల్ హక్,డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, సీఐలు శివశంకర్, సైదులు, భగవంత్ రెడ్డి, ఆర్.ఐ. విజయ్ భాస్కర్, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్, కౌన్సిలర్ మహేష్,ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, రమేష్, సతీష్ రెడ్డి , వెంకటేష్ గౌడ్, నరేష్, బాలరాజు, పోలీసు సిబ్బంది,యు-ంవకులు,విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోక్సో చట్టం పట్ల ప్రజలకి అవగహన అవసరం.

- పిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులకు అడ్డుకట్ట వేయాలి.
- బాల్య వివాహాలని నిషేధించాలి - చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్.




**నారాయణపేట, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాలకు అనుగుణంగా శనివారం నాడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నారాయణపేట వారి ఆధ్వర్యంలో నారాయణపేట టౌన్ ఎయిడెడ్ వైదిక హై స్కూల్ లో బాల బాలికలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు డిఫెన్స్ కౌన్సిల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరైయ్యారు. ఇట్టి సదస్సులో వారు పోక్సో చట్టం గురించి మాట్లాడుతూ పోక్సో చట్టం (పోక్సో అంటే లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం-2012) నవంబరు 14, 2012 నుండి అమలులోకి వచ్చినదని, ఈ చట్టమును అతిక్రమిస్తే కఠిన శిక్షలు వుంటాయని, పిల్లలు మన భవిష్యత్తు". మనకు రక్షణ కల్పించే ఈ చట్టం గురించి అందరికీ, ముఖ్యంగా పిల్లలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలబాలికలందరికీ ఈ చట్టం వర్తిస్తుంది. ఇది లింగ భేదం లేని చట్టం. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరిస్తూ బాలికలను అనవసరంగా తాకడం, లైంగిక వేధింపులకు గురి చేయడం, అశ్లీల చిత్రాలు వంటి వివిధ రకాల నేరాలకు పాల్పడితే ఇందులో కఠిన శిక్షలు ఉన్నాయని, లైంగిక నేరం జరిగినట్లు తెలిస్తే, వెంటనే పోలీసులకు లేదా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , సమాచారం దాచడం కూడా నేరమేనని, నేరం గురించి తెలిసినా, అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు లేదా స్పెషల్ జువెనైల్ పోలీస్ యూనిట్‌కు తెలపడం చట్టరీత్యా తప్పనిసరి అని తెలిపారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట పూర్తిగా వేయాలి అని, పిల్లలో పనిలో కాదు బడి లో ఉండాలి. చిన్న వయసులో పిల్లలికి పెళ్లిళ్లు చేస్తే జరిగే అనర్ధాల గురించి వివరించారు. ఇట్టి కార్యక్రమానికి హాజరైన పారా లీగల్ వాలంటీర్ హాజమ్మ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి తెలుసుకొని తమని తాము రక్షించుకుంటూ ఇతరులు కూడా ఈ చట్టం ధ్వారా రక్షణ పొందే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం-ంలో ఎయిడెడ్ వైదిక హై స్కూల్ హెడ్ మాస్టర్ కే.గంగాధర్ , స్కూల్ బోధన, బోధనేతర సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర కేబినెట్ పలు ముఖ్య నిర్ణయాలను ఆమోదించింది. దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, గ్రామీణ రహదారుల మెరుగుదలపై దృష్టి సారిస్తూ నిర్ణయాలు తీసుకుంది. రాజమండ్రి--విశాఖపట్నం మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 శాతం డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) పెంపు నిర్ణయించింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనను మరిన్ని మూడు సంవత్సరాల పాటు పొడిగించింది. భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రూ. 12,980 కోట్ల నిధులు కేటాయించింది. కాకినాడ, మచిలీపట్నం, గంగవరం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ కోసం రూ. 9,889 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 198 కిలోమీటర్ల మేర కారిడార్ ఏర్పాటు చేయనుంది. గోదావరి నదిపై సుమారు 4.3 కిలోమీటర్ల పొడవైన వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్‌లో రవాణా, వాణిజ్య రంగాలకు పెద్ద ఊతం లభించనుంది.

## అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెట్రోల్ మరియు డీజిల్ రి ఫిల్లింగ్ చేసే సిబ్బందికి అవగాహన

- కొడంగల్ అగ్నిమాపక అధికారి పి. ప్రభాకర్




**కొడంగల్ మున్సిపల్, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం కొడంగల్ శ్రీ రాఘవేంద్ర ఫిల్లింగ్ స్టేషన్ లో అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సత్వర అప్రమత్తత గూర్చి పెట్రోల్ మరియు డీజిల్ రి ఫిల్లింగ్ చేసే సిబ్బందికి వివరించడం జరిగిందని అగ్నిమాపక అధికారి తెలిపారు. ఒకవేళ అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్స్టిన్విషర్స్ ని ఎలా వాడాలో వివరంగా చూపించడం జరిగింది పెట్రోల్ మరియు డీజిల్ రి ఫిల్లింగ్ చేసే సమయంలో అక్కడ సెల్ ఫోన్లు వినియోగించకూడదని సూచించడం జరిగింది అగ్ని ప్రమాదానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అలాగే వంట గ్యాస్ వినియోగించేటప్పుడు జరిగే ప్రమాదాల గూర్చి ముందస్తు జాగ్రత్తలు తగు సూచనలు ప్రమాదాల నివారణ ప్రమాదం జరిగిన వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించిట్లి కొడంగల్ అగ్నిమాపక అదికరి పి.ప్రభాకర్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కొడంగల్ అగ్నిమాపక అధికారి తోపాటు సిబ్బంది,మరియు ప్రజలు పాల్గొన్నారు

## వికారాబాద్ లోని ప్రభుత్వ ఐ.టీ.ఐ/ ఏ.టి.సి లో 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా...

- మూడవ బ్యాచ్ తేదీ 20-04-2026 నుండి 02-05-26 పలు షాట్ టెక్నికల్ కోర్సులకు
- దరఖాస్తుల ఆహ్వానం ఏ.టి.సి ఇంచార్జి ఎస్.ఏం. సురేష్



**వికారాబాద్, ఏప్రిల్,18(సమయం న్యూస్) :** వికారాబాద్ లోని ప్రభుత్వ ఐ.టి.ఐ/ ఏ.టి.సి లో 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా మూడవ బ్యాచ్ తేది :20-04-2026 నుండి 02-05-2026 పలు షార్ట్ టర్మ్ టెక్నికల్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వాని స్తున్నట్లు ఎ.టి.సి ఇన్చార్జి .ఎస్.ఏం.సరూష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా. సి.ఎన్.సి లేత్ మిషన్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్, సి.ఎన్.సి మిల్లింగ్ మిషన్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్,ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ పై అవగాహన కోర్సు, జూనియర్ రోబోట్ ఆపరేటర్- ప్రోగ్రామర్ (ఆర్క్ వెల్డింగ్), ఎలక్ట్రికల్ వెహికల్ పై బేసిక్ కోర్స్ , క్యాడ్ 2డి మరియు 3డి ఫీచర్స్ ఉపయోగించి జూనియర్ ప్రోడక్ట్ డిజైనర్ వంటి కోర్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు స్వల్పకాలిక శిక్షణ ద్వారా అభ్యర్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యాన్ని సంపాదించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచు కోవచ్చని తెలిపారు,ఈ కోర్సులకు 10వ తరగతి ,ఐటిఐ,డిప్లొమా, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు పూర్తి వివరాల కోసం ప్రభుత్వ ఎ.టి.సి/ ఐటిఐ వికారాబాద్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అలాగే ఈ 9177472488, 9550112364 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎ.టి.సి ఇన్చార్జి ఎస్.ఎమ్. సరూష్ తెలియ జేయడం జరిగింది ఈ కోర్సులకు 7 బ్యాచ్ లలో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.

## జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించాలి

**- మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి**




**తాండూర్ మున్సిపల్, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** మే 11 నుండి జరిగే జనాభా లెక్కల్లో భాగంగా ఇండ్ల గణనను పకడ్బందీగా నిర్వహించాలని తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి కోరారు. తాండూర్ మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ మీటింగ్ హాల్లో శనివారం జనాభా గణన ఎనమారేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సూపర్వైజర్లు తమ తమ పరిధిలో ఎప్పటికప్పుడు పరిశీలించి తప్పులు జరగకుండా చూడాలని కోరారు. జనాభా గణాలకు సంబంధించిన మార్గదర్శకాలను అందరూ తప్పక చదివి మార్గదర్శకాలు అనుగుణంగా ఇండ్ల చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మాస్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్స్




**ఖమ్మం, ఏప్రిల్ 18:( సమయం న్యూస్ ) :** గత మాసంలో ప్రారంభమైన మాస్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ 2026 ఫైనల్ పోటీ జిల్లాలోని మధిర నియోజకవర్గ ఎర్రుపాలెం మండలంలో గల మీనవోలు పిల్లిబోస్ గ్రౌండ్ లో ఆదివారం జరగనుంది. అంతకుముందు జరిగిన సెమీఫైనల్స్ లో ఫస్ట్ సెమీ ఫైనలిస్టు, సెకండ్ సెమీ ఫైనలిస్ట్ గా విజేతలైన టీములకు తలా రూ.10 వేలు బహూకరించారు. ముస్లి ఐక్య సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన రెండు రాష్ట్రాల స్థాయి క్రికెట్ మాస్ ప్రీమియర్ లీగ్ ఆదివారం జరిగే ఫైనల్ తో ముగియనుంది. ఇందులో విజేతగా నిలిచే జట్టుకు రూ.75వేల బహూకరించనున్నారు. శనివారం జరిగిన పోటీలో ఫస్ట్ సెమీఫైనలిస్టుగా బీసీసీ మధిర, రెండో ఫైనలిస్ట్ గా మాస్ కింగ్స్ లెవెన్ మీనవోలు కాగా ఫైనల్ లో బుచ్చిరెడ్డిపాలెం, అగ్రెసివ షుటర్ ఖమ్మం జట్లు తలపడనున్నాయి. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య సంఘం ఎర్రుపాలెం మండల అధ్యక్షుడు షేక్. బాసిత్ అలీ, ఆర్గనైజర్ మహమ్మద్ రఫీ, కోశాధికారి షేక్ నాగుల్ మీరా, కమిటీ సభ్యులు షేక్ జిలానీ, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో మహిళల రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరికి నిరసనగా దిష్టిబొమ్మ దహనం



**బాన్సువాడ ఏప్రిల్ 18(సమయం న్యూస్)** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహిళల రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కూటమి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమం సందర్భంగా నాయకులు నినాదాలు చేస్తూ కాంగ్రెస్ కూటమి నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నారీశక్తి వందన్ చట్టం ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టానికి విస్తృత మద్దతు లభించిందన్నారు. అయితే, పార్లమెంటులో ఈ బిల్లుకు కాంగ్రెస్ కూటమి ప్రజాప్రతినిధులు వ్యతిరేకంగా ఓటు వేయడం మహిళల సాధికారతకు విరుద్ధమని ఆయన విమర్శించారు. మహిళల హక్కులను కాపాడాల్సిన పార్టీలు ఇలాంటి కీలక అంశాల్లో వ్యతిరేకంగా నిలవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా మహిళలు కాంగ్రెస్ పార్టీ కుట్రలను గుర్తించి, మహిళల అభ్యున్నతికి అడ్డుపడుతున్న వారికి రానున్న ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన అభివృద్ధి మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చిదుర సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, మున్సిపల్ సభ్యుడు గజ్జల మహేష్, పాశం ఆమని, భాస్కర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు అనిల్, సిద్ధి బాలరాజ్, రామకృష్ణ, గ్రామీణ అధ్యక్షులు మజ్జిగ శ్రీనివాస్, మహిళా నాయకులు రేణుక, విజయలక్ష్మి, లక్ష్మి, ఐశ్వర్య, యమునా, సవిత, లావణ్య, సారిక, అంకిత తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లాలో టీఓఎస్ఎస్ పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,IPS.



**వికారాబాద్, ఏప్రిల్ ,18(సమయం న్యూస్):** ఈ నెల 20వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్ఎస్సీ మరియు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి వికారాబాద్ టౌన్‌లో రెండు ఎస్ఎస్సీ, రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలు, అలాగే తాండూరు టౌన్‌లో ఒక ఎస్ఎస్సీ మరియు రెండు ఇంటర్మీడియట్ కేంద్రాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. పరీక్షలు జరిగే అన్ని కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబంధిత ఎస్.హెచ్.ఓలు మరియు ఇన్‌స్పెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ వివరించారు. పరీక్షల సమయంలో అవాంఛనీయమైన సంఘటనలు అరికట్టడానికి పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాలలో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై నిఘా ఉంచడంతో పాటు, నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని , అభ్యర్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకోవాలని, బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఇసుక లభ్యత గల ప్రాంతాల నుంచి రవాణాకు అనుమతులు ఇవ్వాలి

- జిల్లాలో మరో పది ఇసుక రీచ్ ల ఏర్పాటు.
- డీ ఎల్ ఎస్ సీ సమావేశంలో కలెక్టర్ ప్రతీక్ జైన్.




**నారాయణపేట, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్ లతో పాటు అదనంగా ఇసుక లభ్యత గల మరో పది రీచ్ లను ఏర్పాటు చేసి మన ఇసుక మన వాహనం ద్వారా రవాణాకు ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాశీడ్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మన ఇసుక మన వాహనం ద్వారా ప్రస్తుతం జిల్లాలోని వర్కూరు పరిధిలోని నాలుగు రీచ్ లతో పాటు ఉట్కూర్ మండలంలోనీ నాగిరెడ్డి పల్లి రీచ్ ల నుంచి ఇసుకను తరలించేందుకు ఆన్ లైన్ అనుమతులు జారీ చేస్తున్నామని, ఇకపై జిల్లాలో గుర్తించిన మరో పది ఇసుక రీచ్ ల నుంచి కూడా రవాణాను ఆన్ లైన్ అనుమతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఆయా రీచ్ లకు కే ఏం ఎల్ మ్యాపింగ్ చేసి రెవెన్యూ, మైనింగ్,భూగర్భ జల వనరుల శాఖ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అమ్మి కుంట, నేరేడు గాం, సంగం బండ, మిశ్రిఫా, రాకొండ( చెక్ డ్యాం) పరిధిలోనూ ఇసుక లభ్యత, రవాణా పై అధికారులు క్షేత్ర సాయి పరిశీలన చేయాలన్నారు. గతంలో 21 రీచ్ లు ఉండగా, ఇప్పుడు నాలుగైదు రీచ్ లనే గుర్తించడం ఏమిటని, కనీసం 18 రీచ్ ల నుంచి మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు గుర్తించిన పది రీచ్ లకు సంబంధించి ఆయా శాఖల అధికారుల నివేదికలు క్లియర్ గా ఉన్నాయా లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. మరోసారి ఆయా రీచ్ లను అధికారులు జాయింట్ ఇన్స్ పెక్షన్ చేసి పూర్తి స్థాయి నివేదికను పది రోజులలో ఇవ్వాలన్నారు. కాగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మన రాష్ట్ర పరిధి ముగింపు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదే నెలలో మరోసారి నిర్వహించే డీ ఎల్ ఎస్ సీ సమావేశంలో పది రీచ్ ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి, మైనింగ్ ఏ డీ గోవింద రాజు, భూగర్భ జల వనరుల శాఖ ఏ డీ రవి, నీటి పారుదల శాఖ ఈ.ఈ. బ్రహ్మానందరెడ్డి,ధన్వాడ, మరికల్, ఉట్కూర్, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతి గృహాలలో మౌలిక వసతి సదుపాయాలు కల్పించాలి

- వసతి గృహాలలో వందశాతం మెనూ అమలు చేయాలి.
- వసతి గృహాలను మన ఇంటిలా భావించాలి.
- విద్యార్థులను మన పిల్లలలా చూసుకోవాలి.
- వసతి గృహాల వార్డెన్ల సమీక్షలో కలెక్టర్ ప్రతీక్ జైన్.




**నారాయణపేట,ఏప్రెల్,18(సమయం న్యూస్) :** వసతి గృహాలను వార్డెన్లు తమ ఇంటిలా భావించాలి.. అక్కడ ఉండే విద్యార్థినీ విద్యార్థులను సొంత పిల్లలలా చూసుకోవాలి.. వంద శాతం కచ్చితమైన మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందించాలి.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతి సదుపాయాల కల్పనకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్ల ( హెచ్ డబ్ల్యు ఓ)తో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని, ప్రభుత్వ పరంగా వచ్చే ప్రతిదీ వారికి అందించడం మన బాధ్యత, వృత్తి ధర్మం అని కలెక్టర్ తెలిపారు. ప్రతీ వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా నీళ్ళు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, వెలుతురు ఉండాలన్నారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలలో మరుగుదొడ్లు, స్నానపు గదులు తగినన్ని ఉండాలని తెలిపారు. వసతి గృహాలలో మెనూ అమలు కావడం లేదనే ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, ఇకపై అలాంటి ఫిర్యాదులు రాకుండా లేకుండా వంద శాతం మెనూ అమలు చేయాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. ఇతర జిల్లాల్లో( వికారాబాద్, మరి కొన్ని జిల్లాలు) మెనూ అమలు చేస్తున్నారని, మరి మన జిల్లాలో ఎందుకు అమలు చేయడం లేదని వార్డెన్ల ను ఆయన ప్రశ్నించారు. వర్కర్లు లేరని, సరుకులు సరిపోవడం లేదని, అవసరమైన సామాగ్రి లేదనే కారణాలు చెప్పకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం భోజనం స్నాక్స్ ఇవ్వాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల మెనూ విషయంలో తాను కాంప్రమైజ్ కానని సూటిగా చెప్పారు. తాను వికారాబాద్ జిల్లాలోని ప్రతీ వసతి గృహాన్ని సందర్శించానని, ఆయా వసతి గృహాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతను పరిశీలించానని సమావేశంలో కలెక్టర్ గుర్తు చేశారు. వసతి గృహాలలో అవసరమైన మౌలిక వసతి సదుపాయాల కల్పనకు మూడు రోజులలో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని వార్డెన్లకు సూచించారు. మన ఇంటిని ఎలా చూసుకుంటామో వసతి గృహాలను కూడా అలాగే చూసుకోవాలన్నారు. ఈ వేసవి సెలవులలో జిల్లాలోని అన్ని వసతి గృహాలలో మరమ్మతు పనులను పూర్తి చేయించాలని, తన వంతు నిధులు కేటాయిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు. అయితే వసతి గృహాల లోపలికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎం ఎల్ సీ లకు తప్ప వేరే ఎవరిని అనుమతించ వద్దని, ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అస్సలు అనుమతించవద్దని ఎవరైనా అడిగితే కలెక్టర్ ఆదేశం అని చెప్పాలని, ప్రోటోకాల్ పాటించాలని కలెక్టర్ వార్డెన్ల ను ఆదేశించారు. తాను వికారాబాద్ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో కల్పించిన వసతి సదుపాయాల బిఫోర్ / ఆఫ్టర్ చిత్ర మాలికలను సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వార్డెన్లకు చూపించారు. అనంతరం జిల్లాలో సొంత భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాలు, అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాల వివరాలు, విద్యార్థినీ విద్యార్థులు సంఖ్య, ప్రస్తుతం ఉన్న గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, వంట సామాగ్రి, వర్కర్లు, ప్రస్తుతం ఉన్న వసతులు, అవసరమైన సదుపాయాల గురించి వసతి గృహాల వారీగా వార్డెన్ల ను అడిగి తెలుసుకున్నారు. ముందుగా సొంత భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాలలో చేయాల్సిన మరమ్మతు పనుల కోసం స్థానికంగా ఉండే తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల ను పిలిపించి ఎంత వ్యయం అవుతుందో ప్రతిపాదనలు తయారు చేసి నెక్స్ట్ సమావేశం నాటికి తీసుకు రావాలని ఆదేశించారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతి గృహాల మరమ్మతు పనుల విషయంలో ఆయా భవనాల యజమానులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయం తీసుకుందామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ఏఎస్ డబ్లుఓ పరమేశ్, జిల్లాలోని ఆయా వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందించాలి.

- అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, ఏప్రెల్,18(సమయం న్యూస్) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణ,గర్భవతులకు అన్ని రకాల సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మాతా శిశు సంరక్షణ,గర్భవతులకు అన్ని రకాల సేవలను అందిస్తూ వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని,మాతృ మరణాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. జిల్లా పరిధిలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహణ 62 శాతం మాత్రమే ఉందని దీనిని 100 శాతం సాధించే విధంగా వైద్యులు కృషి చేయాలని సూచించారు. టి.బి వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్ పరీక్షలు మరియు నిర్ధారణ అయిన వారందరికీ చికిత్స అందిస్తూ వారి వివరాలు ఎప్పటికప్పుడు నిశ్చయ్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిధిలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా నిరోధించడం కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ నిర్దేశిత లక్ష్యం మేరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం జరగకపోవడం వలన జిల్లా విద్యాశాఖ అధికారి మరియు సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న సంకల్ప్ కార్యక్రమ అమలుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మరియు డిసి హెచ్ఎస్ సమన్వయ సమావేశం నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలోని 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా జాతీయ నాణ్యతా ప్రమాణాల నిబంధనలు తప్పకుండా పాటించాలని అందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం అవసరమైతే అంచనాలు రూపొందించినట్లయితే నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఇకనుండి జిల్లా పరిధిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రతి వారం ప్రగతి నివేదికలు తీసుకొని సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి జిల్లా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందజేస్తున్న వివిధ రకాల సేవల ను,సాధించిన ప్రగతి లక్ష్యాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ , ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, కొడంగల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ మాలతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ పద్మ, డిప్యూటీ డిఎంహెచ్ఓ లు డాక్టర్ రవీంద్ర యాదవ్, డాక్టర్ జ్యోతి,వైద్యులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్ సత్తా!





**హైదరాబాద్, ఏప్రిల్ 18:** సొంత గడ్డపై సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ ఆర్ హెచ్) సత్తా చాటింది. ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (సీ ఎస్ కే) పై 10 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ ఆర్ హెచ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో సీ ఎస్ కే పోరాడినా.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 184 పరుగులకే పరిమితమైంది. బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ, బౌలింగ్ లో ఈషాన్ మలింగ అద్భుత ప్రదర్శనతో సన్ రైజర్స్ కు విజయాన్ని

## ఆకాశమే హద్దుగా అభిషేక్, క్లాసెన్

మొదట బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ కు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా అభిషేక్ శర్మ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 22 బంతుల్లోనే 59 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ట్రావిస్ హెడ్ 20 బంతుల్లో 23 పరుగులు చేసి రాణించాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. 39 బంతుల్లో 59 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. చివర్లో వికెట్లు పడినా.. సన్ రైజర్స్ 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. సీ ఎస్ కే బౌలర్లలో అన్షుల్ కంబోజ్ 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. జేమీ ఓవర్టన్ 4 ఓవర్లలో 37 పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ముకేశ్ చౌదరి 2 వికెట్లు తీశాడు.

## తడబడిన చెన్నై ఛేదన

195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ కు ఆశించిన ఆరంభం లభించలేదు. సన్ రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో చెన్నై బ్యాటర్లు భారీ షాట్లు ఆడేందుకు ఇబ్బంది పడ్డారు. ఓపెనర్ మ్యాట్ షార్ట్ 30 బంతుల్లో 34 పరుగులు చేసి కాస్త పోరాడాడు. మిడిలార్డర్ లో కుర్రాడు ఆయుష్ మ్హాత్రే 13 బంతుల్లోనే 30 పరుగులు చేసి ఆశలు రేపాడు. సర్ఫరాజ్ ఖాన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. వీరు మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ భారీ స్కోర్లు చేయలేకపోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు.

## కట్టడి చేసిన బౌలర్లు

సన్ రైజర్స్ బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. ఈషాన్ మలింగ తన 4 ఓవర్ల కోటాలో 29 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. యువ పేసర్ నితీశ్ కుమార్ రెడ్డి 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. శివాంగ్ కుమార్ తన 3 ఓవర్ల స్పెల్ లో కేవలం 18 పరుగులు ఇచ్చి ఒక వికెట్ దక్కించుకుని చెన్నై బ్యాటర్లను కట్టడి చేశాడు. బౌలర్ల సమష్టి కృషితో సన్ రైజర్స్ సొంత మైదానంలో అభిమానులకు ఉత్కంఠ



# ఢిల్లీ ధమాకా!

- ఆఖరి బంతి ముంగిట డీసీ విజయం
- నిలిచిన స్టబ్స్, రాహుల్ క్రీజు పోరాటం
- సత్తా చాటిన ఢిల్లీ స్పిన్నర్లు
- సాల్ట్ మెరుపులు, కోహ్లీ శ్రమ వృథా
- ఆకట్టుకున్న ట్రిస్టన్ స్టబ్స్ ఆటతీరు

## బెంగళూరుకు తప్పని పరాజయం

**బెంగళూరు, ఏప్రిల్ 18:** ఐపీఎల్ లో మరో ఉత్కంఠ భరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పై ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆఖరి ఓవర్ వరకు నరాలు తెగే ఉత్కంఠ నడుమ సాగిన ఈ పోరులో ఢిల్లీ కేవలం ఒక బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేయగా.. లక్ష్య ఛేదనలో డీసీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఒత్తిడిని జయించి అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించిన ట్రిస్టన్ స్టబ్స్ కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

## సాల్ట్ మెరిసినా.. తడబడిన మిడిలార్డర్

టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీ కి ఓపెనర్ ఫిల్ సాల్ట్ అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. కేవలం 38 బంతుల్లోనే 63 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విరాట్ కోహ్లీ (13 బంతుల్లో 19) కాసేపు మెరుపులు మెరిపించాడు. ఒక దశలో ఆర్సీబీ భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే డీసీ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మిడిలార్డర్ తడబడింది. చివర్లో టిమ్ డేవిడ్ (17 బంతుల్లో 26) రాణించడంతో ఆర్సీబీ 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. డీసీ బౌలర్లలో అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, లుంగి ఎంగిడి తలా రెండు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశారు.

## రాహుల్ మెరుపులు.. స్టబ్స్ ఫినిషింగ్

176 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ కు ఓపెనర్ కేఎల్ రాహుల్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ 34 బంతుల్లోనే 57 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్ బాధ్యతాయుతంగా ఆడాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం తొందరపడకుండా అక్షర్ పటేల్ (19 బంతుల్లో 26) తో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. భువనేశ్వర్ కుమార్ (4 ఓవర్లలో 3/26) అద్భుతమైన బౌలింగ్ తో ఢిల్లీని దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. కానీ స్టబ్స్ (47 బంతుల్లో 60 నాటౌట్) క్రీజులో పాతుకుపోయి మ్యాచ్ ను విజయవంతంగా ముగించాడు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో విజయానికి పరుగులు అవసరమైన దశలో రోమారియో షెఫర్డ్ బౌలింగ్ లో లాంఛనాన్ని పూర్తి చేశాడు.








## రస్ట్ రెడ్ లుక్‌లో అదరగొట్టిన

# 'ఫౌజీ' లేడీ



కన్నడ సినీ ప్రపంచంలో 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' చిత్రంతో తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న చైత్ర జే ఆచార్ ఇప్పుడు తన కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోందని టాక్ వినిపిస్తోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్‌గా పేరొందిన ఆమె, త్వరలోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఫౌజీ'లో చైత్రకు అవకాశం దక్కినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇదే నిజమైతే, చైత్రకు ఇది తెలుగు తెరపై ఎంతో ఆసక్తికరమైన డెబ్యూ అవుతుంది. 1940ల కాలనీయ భారతదేశం నేపథ్యంగా రూపొందుతున్న 'ఫౌజీ' ఒక పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఇమాన్వి కూడా ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైత్ర ఇటీవల రస్ట్ రెడ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సింపుల్ స్టైల్‌తోనే ఎలిగెంట్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ ఆమె అందం అభిమానులను ఆకట్టుకుంటోంది. నటనతో పాటు స్టైల్‌లోనూ మెప్పిస్తున్న చైత్ర, 'ఫౌజీ'తో టాలీవుడ్‌లో ఎలాంటి ముద్ర వేస్తుందో చూడాలి. ఈ సినిమా 2026 చివరలో లేదా 2027లో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం.





## అందంలో సూపర్ హిట్...

# సక్సెస్ యావరేజ్

మోడలింగ్ నుంచి వెండితెరకు వచ్చిన దివ్యభారతి తన అందం, స్టైల్‌తో తొలినాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. కానీ తొలి సినిమా తర్వాత రావాల్సిన అవకాశాలు ఆలస్యమవడంతో ఆమె కెరీర్ ఊహించినంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఆమె దగ్గర ఉన్న ప్రతిభ పూర్తిగా బయటపడే అవకాశాలు ఇంకా దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. సినిమాల్లో విరామం కనిపించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆమె ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల రాయల్ బ్లూ గౌన్‌లో చేసిన ఫోటోషూట్‌లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాదాసీదా లుక్‌లోనూ ఆకట్టుకునే గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కెమెరా ముందు ఆమె చూపించే ఆత్మవిశ్వాసం, ప్రెజెన్స్ మాత్రం ఎప్పటికీ తగ్గదని మరోసారి స్పష్టమైంది. అయితే నిజమైన గుర్తింపు మాత్రం ఒక పెద్ద విజయంతోనే వస్తుంది. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే దివ్యభారతి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందంతో ఆకట్టుకున్న ఆమె, కెరీర్‌లో కూడా అదే స్థాయి విజయాన్ని ఎప్పుడు అందుకుంటుందో చూడాల్సి ఉంది.



## సల్మాన్‌లో వంశీ పైడిపల్లి మూవీ




బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళు_తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## వారణాసి కోసం పాట చిత్రీకరణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్‌ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్‌ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్‌ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.







## బన్నీలో ఆ గ్రేస్ చాలా ఇష్టం

తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో దగ్గరైన అవికా గోర్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తన అభిమానం వ్యక్తం చేసింది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బన్నీ డాన్స్ స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పింది. ముఖ్యంగా ఆయనలో కనిపించే గ్రేస్ చాలా ప్రత్యేకమని, అదే తనకు అత్యంత ఇష్టమని పేర్కొంది. "డాన్స్‌లో ఆయన చూపించే ఆ ఫ్లో, ఈజ్ చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి గ్రేస్ ప్రతి ఒక్కరికి సాధ్యం కాదు" అని ఆమె తెలిపింది. అల్లు అర్జున్ కేవలం డాన్స్‌లోనే కాకుండా, తనను తాను తీర్చిదిద్దుకునే విధానంలోనూ ఎంతో ప్రేరణనిస్తారని అవికా చెప్పింది. ఆయనలో ఉండే ఎనర్జీ, పాజిటివ్ వైబ్ తనను బాగా ఆకట్టుకుంటాయని పేర్కొంది. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఎదిగిన బన్నీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

## గోల్డ్ లుక్‌లో గ్లామర్ షో..

# ప్రగ్యా హాట్ హంగామా!

ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామర్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. సినిమాల్లో అందంతో ఆకట్టుకునే ఈ బ్యూటీ, ఆఫ్‌స్క్రీన్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తూ అభిమానులను మెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ప్రగ్యా గోల్డ్ కలర్ స్లీవ్‌లెస్ టైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ హాట్ హంగామా సృష్టించింది. సింపుల్ యాక్సెసరీస్‌తోనే స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ, చిన్న ఈయర్‌రింగ్స్, గోల్డ్ హైహీల్స్‌తో తన అవుట్‌ఫిట్‌ను మరింత హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రగ్యా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చూపించింది. ఈ ఫోటోలలో ఆమె అందం, స్టైల్ కలిసి అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. గోల్డ్ లుక్‌లో ప్రగ్యా చూపించిన ఈ గ్లామర్ షో, ఆమె ఫ్యాన్స్‌కు మరో విజువల్ ట్రీట్‌గా మారింది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**



# ఏపీకి కొత్త రైల్వే లైన్ల వరం

## ప్రధానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు!

**నిడదవోలు-దువ్వాడ మధ్య 3వ, 4వ లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**గోదావరిపై 4.3 కిలోమీటర్ల మేర మరో భారీ రైల్వే వంతెన**

**ఆధ్యాత్మిక క్షేత్రాలకు మెరుగైన అనుసంధానం.. పారిశ్రామిక వృద్ధికి ఊతం**

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. రాజమండ్రి (నిడదవోలు)– విశాఖపట్నం (దువ్వాడ) మధ్య 3వ మరియు 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై నిర్మించనున్న 4.3 కిలోమీటర్ల పొడవైన రైల్వే వంతెన అత్యంత కీలకం కానుందని సీఎం పేర్కొన్నారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రయాణికులకు సమయం ఆదా అవుతుందని ఆయన వివరించారు. ఈ అదనపు లైన్ల నిర్మాణం ద్వారా వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడమే కాకుండా, సరుకు రవాణా కూడా వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను కలుపుతూ ఈ రైల్వే లైన్ సాగుతుందని, తద్వారా వేలాది మంది భక్తులకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. కేవలం ఆధ్యాత్మిక రంగమే కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి, ఓడరేవు ఆధారిత ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం 'స్వర్ణాంధ్ర' మరియు 'వికసిత్ భారత్' లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వ సహకారం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన



**విశాఖ ఆర్కె బీచ్‌లో అవగాహనలో హోంమంత్రి అనిత**

**విశాఖపట్నం, ఏప్రిల్ 18:** అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆంధప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు, ప్రజలు ఏ విధంగా జాగ్రత్తగా ఉండాలో డెమోలో అధికారులు వివరించారుని తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. అగ్నిప్రమాదాలు, వాటి నివారణ గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో ఆకట్టుకుంది. మెగా ÷ర్ సర్వీస్ డెమోను అతిథులు, నగరవాసులు ఆసక్తిగా తిలకించారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే అమూల్యమైన పాత్రను అగ్నిమాపక శాఖ అధికారులు వివరించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 వరకు అగ్నిమాపక శాఖను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల రూ. 232 కోట్లతో ÷ర్ వెహికల్స్ కొనుగోలు చేశామని

# పునర్విкకు పునర్జన్మ

**చిట్టి చెల్లెలు చిరునవ్వుల కోసం అన్నగా మంత్రి నారా లోకేష్ అలుపెరుగని కృషి**

**రూ.16 కోట్ల ఖరీదైన జోల్ జెన్ స్మా ఇంజెక్షన్ విదేశాల నుంచి తెప్పించేందుకు లోకేష్ సాయం**



**హైదరాబాద్, ఏప్రిల్18:** అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో మృత్యువుతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అండతో పునర్జన్మ లభించింది. రూ.16 కోట్ల ఖరీదైన 'జోల్ జెన్ స్మా' ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి రప్పించి, ఆ చిన్నారి ప్రాణాలు నిలపడంలో లోకేష్ ఒక అన్నగా అన్నీ తానై వ్యవహరించారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి సమక్షంలోనే వైద్యులు చిన్నారికి ఈ అత్యంత ఖరీదైన జీన్ థెరపీ ఇంజెక్షన్‌ను అందజేశారు. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగళ సురేష్ కుమార్ కుమార్తె పునర్విక ఈ అరుదైన వ్యాధి బారిన పడింది. క్షవర వృత్తి చేసుకునే ఆ తండ్రికి రూ.16 కోట్ల ఖర్చు భారం కావడంతో సోషల్ మీడియా ద్వారా దాతల సాయం కోరారు. ఫిబ్రవరి నాటికి రూ.10 కోట్ల వరకు విరాళాలు అందాయి. మిగిలిన మొత్తం కోసం చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మంత్రి లోకేష్‌ను అభ్యర్థించారు. తక్షణమే స్పందించిన లోకేష్.. "పునర్విక బాధ్యత నాది, ఆ చిన్నారిని కాపాడుకుందాం" అంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం విదేశాల నుంచి ఇంజెక్షన్ తెప్పించేందుకు అవసరమైన అన్ని అనుమతులు, రవాణా మరియు నిధుల సమీకరణలో నిరంతరం పర్యవేక్షించి చికిత్స విజయవంతం అయ్యేలా చూశారు. ఇంజెక్షన్ ఇచ్చే సమయంలో ఆసుపత్రికి చేరుకున్న లోకేష్.. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంజెక్షన్ తీసుకుంటున్న సమయంలో చిన్నారి ఏడుస్తుండటంతో స్వయంగా ఎత్తుకుని లాలించి, ఓదార్చారు. పునర్విక తల్లిదండ్రులను పరామర్శించి, ఇకపై కూడా ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. లక్షలాది మంది దాతల ఉదారత, ప్రార్థనల వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడుకోగలిగామని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు. అమెరికాకు చెందిన ప్రముఖ ఔషధ కంపెనీ నోవార్టిస్ మరియు రెయిన్‌బో ఆసుపత్రి వర్గాలతో లోకేష్ సిబ్బంది నిరంతరం సమన్వయం చేసుకున్నారు. వైద్య పత్రాల తయారీ నుంచి ప్రభుత్వ ధృవపత్రాల వరకు ఎక్కడా జాప్యం జరగకుండా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మంత్రి చూపిన ఈ చొరవ పట్ల చిన్నారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఒక సామాన్య కుటుంబానికి చెందిన బిడ్డ కోసం ఒక మంత్రి

# విజయవాడ నుంచి హజ్ యాత్రికులకు ఘన వీడ్కోలు

- మంత్రి, ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు
- మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం
- 353 మంది యాత్రికులు ప్రయాణం



**విజయవాడ, ఏప్రిల్ 18:** విజయవాడ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు బయల్దేరుతున్న ముస్లిం మైనార్టీ సోదరులకు ఘనంగా వీడ్కోలు పలికారు. గన్నవరం ఎస్.ఎం. కన్వెన్షన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్, ఎమ్మెల్యే నజీర్, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్తో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేసి, పచ్చ జెండా ఊపి హజ్ యాత్ర ను ప్రారంభించారు. జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలనేది ప్రతి ముస్లిం సోదరుడి కల అని నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి యాత్రను సులభతరం చేయడం అభినందనీయమని తెలిపారు. మైనార్టీ సంక్షే మానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడిం చారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొత్తం 1987 మంది హజ్ యాత్రకు బయల్దేరగా, విజయవాడ నుంచి 353 మంది వెళ్లడం విశేషమని పేర్కొన్నారు. యాత్ర సురక్షితంగా, విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. మైనార్టీ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మత పెద్దలు, యాత్రికుల

# ఇంద్రకీలాద్రిపై 'రాక్ మెకానిక్స్' బృందం పరిశోధన

**కొండరాళ్లు జారకుండా శాస్త్రీయంగా సర్వే..**

**స్వయంగా పర్యవేక్షించిన ఈవో శీనా నాయక్**



**విజయవాడ:** విజయవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై కొండరాళ్లు జారిపడకుండా శాశ్వత పరిష్కారం కనుగొనే దిశగా దుర్గగుడి దేవస్థానం కీలక అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా శనివారం 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్' బృందం కొండ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. ఆలయ ఈవో కె.ఎస్. శీనా నాయక్ స్వయంగా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఈ బృందంతో పర్యటించి, కొండ రాళ్ల పరిమాణం మరియు భౌగోళిక స్థితిగతులపై జరుగుతున్న పరిశోధనను పర్యవేక్షించారు. గతంలో వర్షాల సమయంలో ఘాట్ రోడ్డులో కొండరాళ్లు జారిపడిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే అక్కడ ఇనుప మెష్‌లను ఏర్పాటు చేశారు. అయితే, భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కొండ ఏ విధంగా ఉంది? రాళ్ల పటుత్వం ఎలా ఉంది? అనే అంశాలపై 'బేస్ సర్వే' నిర్వహించారు. ఈ సర్వే విధానం వల్ల కలిగే ప్రయోజనాలను, ఆధునిక సాంకేతికతతో కొండను ఎలా రక్షించవచ్చో ఈవో నిపుణులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విజయవాడలో ఎండలు తీవ్రంగా మండుతున్న నేపథ్యంలో, అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. క్యూ లైన్లలో కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు, చల్లని తాగునీరు మరియు మజ్జిగ పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులు ఎండ దెబ్బకు గురికాకుండా ఘాట్ రోడ్డు పొడవునా చలువ పందిళ్లు, మ్యాటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా కొండ ప్రాంతంలో చేపట్టాల్సిన మరిన్ని పనులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఆలయ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ఇంద్రకీలాద్రిని కాపాడుకునేందుకు దేవస్థానం అత్యాధునిక ఇంజనీరింగ్ పద్ధతులను అవలంబించనుంది. ఈ పర్యటనలో ఆలయ ఈఈ, ఏఈలు మరియు ఎన్ఐఆర్ఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు నిరాహార దీక్ష విరమణ

**గుంటూరు:** వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తన నిరాహార దీక్షను విరమించారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులు సస్పెండ్ చేయాలని.. తన ఇల్లు, ఆఫీస్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెల్లవారుజామునుంచే జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షకు దిగారు అంబటి రాంబాబు. ఆ నిరాహార దీక్షను సాయంత్రం వరకూ అంబటి కొనసాగించారు. మాజీ హోంమంత్రి సుచరిత.. అంబటి రాంబాబు దీక్షను విరమింపజేశారు. అంబటి దీక్షకు వైఎస్సార్‌సీపీ నేతలు సంఘీభావం ప్రకటించారు. ఆయనకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు దీక్షా శిబిరానికి తరలివచ్చాయి. దీనిలో భాగంగా సుచరిత మీడియాతో మాట్లాడుతూ.. అంబటి ఇంటిపై దాడి హేయమని, 7 గంటల పాటు దాడులు జరిగినా పోలీసులు స్పందించకపోవడం దారుణమన్నారు. అంబటిని వేధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. దాడి చేసిన టీడీపీ గూండాలను అరెస్ట్ చేయాలన్నారు.

# 24 గంటల్లోనే బాలుడి రక్షణ!

## పోలీసుల 'ఆపరేషన్ శివరామరాజు' సక్సెస్



**పాత బట్టల ఆశచూపి పసికందు అపహరణ**

**ముగ్గురు నిందితుల అరెస్టు**

**గన్నవరం/పెనమలూరు:** కృష్ణా జిల్లా పోలీసు యంత్రాంగం మెరుపు వేగంతో స్పందించి ఒక పసికందు ప్రాణాన్ని కాపాడింది. కిడ్నాప్ గురైన 10 నెలల బాలుడిని 24 గంటల వ్యవధిలోనే సురక్షితంగా రక్షించి, నిందితులను కటకటాల్లోకి నెట్టారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కిడ్నాప్ వెనుక ఉన్న కుట్రను ఛేదించడమే కాకుండా, బాలుడిని క్షేమంగా తల్లికి అప్పగించి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మాదాసు సుమమ్మ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం ఆమె విజయవాడ ఆటోనగర్‌లోని యూసీ టీ స్టాల్ వద్ద ఉండగా.. ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు ఆమెను కలిశారు. తమ వద్ద పాత బట్టలు ఉన్నాయని, ఇస్తామని నమ్మించి ఆమెను ఆటోలో ఎక్కించుకున్నారు. కంకిపాడు ఫ్లైఓవర్ వద్దకు రాగానే, కాలకృత్యాల కని మాయమాటలు చెప్పి సుమమ్మను ఆటోలో నుంచి దింపేశారు. ఆమె కిందకు దిగగానే ఆమె 10 నెలల కుమారుడు శివరామరాజుతో నిందితులు ఆటోలో పరారయ్యారు. బాధితురాలు పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర పర్యవేక్షణలో, పెనమలూరు సీఐ జె.వి. రమణ నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పోలీసులు నిర్విరామంగా శ్రమించి వందలాది సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుల కదలికలను కనిపెట్టి, శనివారం (ఏప్రిల్ 18, 2026) ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మచిలీపట్నంకు చెందిన గంజాల వెంకట నాగ శ్రీనివాసరావు, ఆయన భార్య షేక్ రెహానలు బాలుడిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా, వారికి సహకరించిన విజయవాడ వాంబే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కొమిర కాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 5000 నగదు, కిడ్నాప్‌కు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ కిడ్నాప్ వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. అత్యంత తక్కువ సమయంలో కేసును ఛేదించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సురక్షితంగా తల్లికి అప్పగించారు. పసికందును తిరిగి పొందిన తల్లి ఆనందానికి అవధులు లేవు. జిల్లాలో శాంతిభద్రతల



# అలుపెరుగని పోరాట యోధుడు 'సర్దార్' గౌతు లచ్చన్న!

## జమీందారీ వ్యతిరేక పోరాటంలో అగ్రగామి

## స్వాతంత్ర్యోద్యమం నుండి ప్రత్యేక రాష్ట్ర సాధన వరకు అలుపెరుగని ప్రస్థానం

## నేడు జననేత గౌతు లచ్చన్న వర్ధంతి

**భారతదేశ చరిత్రలో 'సర్దార్' అనే గౌరవ నామంతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నేతలు ఇద్దరే. ఒకరు దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయి పటేల్ అయితే, మరొకరు ఆంధ్రుల ఆరాధ్య దైవం సర్దార్ గౌతు లచ్చన్న. సాహసానికి, కార్యదక్షతకు నిలువుటద్దంగా నిలిచిన లచ్చన్న, తన జీవితాంతం పీడిత వర్గాల పక్షాన నిలబడి పోరాడిన ధీశాలి. ఏప్రిల్ 19న ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకోవడం మనందరి బాధ్యత.**

### స్వాతంత్ర్య సమరంలో సైనికుడిగా:

శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా బారువా గ్రామంలో 1909, ఆగస్టు 16న ఒక సామాన్య గౌడ కుటుంబంలో జన్మించిన లచ్చన్న, కేవలం 21 ఏళ్ల ప్రాయంలోనే గాంధీజీ పిలుపుతో చదువును వదిలి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి కార్యక్రమాల్లో పాల్గొని పలుమార్లు జైలు శిక్ష అనుభవించారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను 'అతి ప్రమాదకరమైన వ్యక్తి'గా గుర్తించి, పట్టిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతి ప్రకటించిందంటే ఆయన పోరాట పటిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు.

### జమీందారీ వ్యతిరేక పోరాటం - కిసాన్ ఉద్యమం:

జమీందార్ల అరాచకాలను ఎదిరించి రైతులకు అండగా నిలవడంలో లచ్చన్న అగ్రగామిగా నిలిచారు. ఆచార్య రంగాతో కలిసి కిసాన్ ఉద్యమాలను నడిపి, జమీందార్ల పక్కల్లో బల్లెంగా మారారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేస్తూ హరిజన సేవా సంఘాలను స్థాపించారు. హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించడమే కాకుండా, పేద విద్యార్థుల చదువుల కోసం ఆర్థిక సహాయం అందించి ఎందరో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి కారణమయ్యారు.

### రాజకీయ ప్రస్థానం - సిద్ధాంతాలకు కట్టుబడి:

టెంకాయ చెట్టు గుర్తుపై స్వతంత్ర పార్టీని నడిపిన లచ్చన్న, రాజీలేని రాజకీయం చేశారు. ప్రకాశం పంతులు మరియు బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. అయితే, మద్యపాన నిషేధం వంటి ఆశయాల విషయంలో ఏకంగా ప్రభుత్వం పతనానికి కారణమైనా వెనకాడలేదు. చిన్న రాష్ట్రాల ఏర్పాటును బలంగా ఆకాంక్షించిన ఆయన, మర్రి చెన్నారెడ్డితో కలిసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గళమెత్తారు. తెలంగాణ ఆవశ్యకతపై పుస్తకాన్ని కూడా రచించి తన మద్దతును చాటుకున్నారు.

### ముగిసిన శకం - మారని జ్ఞాపకం:

కేవలం పదవుల కోసం కాకుండా, ప్రజా శ్రేయస్సు కోసమే రాజకీయాలు చేసిన లచ్చన్న, చివరి దశలో పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి అంకితమయ్యారు. 2006, ఏప్రిల్ 19న ఈ అలుపెరుగని పోరాట యోధుడు కన్నుమూశారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన నేర్పిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...9440595494

# సామాజిక సంస్కర్త పరశు రాముడు

## అక్షయ తృతీయ పరశురాముని జయంతి

**నేడు బెంజమిన్ ఫ్రాంక్లిన్ వర్ధంతి**



(రామ కిష్టయ్య సంగనభట్ల, 9440595494)

భృగు వంశోద్భవుడు, జమదగ్ని మహర్షి కుమారుడు, సహస్ర బాహు డైన కార్త వీర్యార్జునుని సంహరించిన, మహా వీరుడు పరశు రాముడు. తండ్రి ఆజ్ఞానువర్తియై, కన్నతల్లిని హతమార్చి, తిరిగి తండ్రి ఆశీస్సులతో, పునరుజ్జీవితు రాలిగా చేసిన ధర్మవీరుడు. భూ భారాన్ని తగ్గింప, భార్గవ రాముని రూపంలో ఉదయించాడు శ్రీహరి. అనులోమ సంజాతుడు అయి, బ్రాహ్మణుడగు జమదగ్నికి, క్షత్రియురాలగు రేణుకకు జన్మించి బ్రాహ్మణ, క్షత్రియ వివాదాలను గొడ్డలితో తీర్చి, ఆటవికులకు యజ్ఞోపవీత ధారణ గావించి, బ్రాహ్మణులుగా మార్చిన అసామాన్య సామాజిక సంస్కర్త పరశు రాముడు. అంతేకాదు బ్రాహ్మణ పక్షపాతియై, క్షత్రియులను అనేకులను సహకరించిన పరశు రాముడు, "మీరెన్ని దానములు పట్టినను, ఎంతగా కష్టపడిననూ, విద్య వచ్చును గాని, ధనము రాదని, వచ్చిననూ అది నిలువ ఉండదని", బ్రాహ్మణ కులానికి శాపమిచ్చినట్లుగా కథనం ఉంది. ఆజన్మాంతం క్షత్రియ కులాన్ని నిర్మూలించిన పరశు రాముడు, క్షత్రియుడు అయిన శ్రీరాముని చేతిలో ఓడిపోవడం, శివ ధనుస్సు విరిచి, వివాహితుడై వస్తున్న దశరథ రాముని, ఎదిరించి, భంగ పడడం, విష్ణువు యొక్క ఒక ఒక అవతారం చేత, మరొక అవతారం ఓడింప బడిన సందర్భం ప్రత్యేకం. పరశు రామా! దశరథ రాముడి సందర్శనం అయ్యాక, నీవు శస్త్రం పట్టవద్దు. ఎందుకంటే నీ వైష్ణవ తేజస్సు అతనిలో ప్రవేశిస్తుంది. అది సురకార్యం నిర్వహిస్తుంది. అని శంకరుడు పరశు రామునికి లోగడ చెప్పడమే దీనికి కారణం అని పురాణ కథనం.

విష్ణువు దశావతారాలలో ఆరవది పరశు రామావతారం. పురుషార్థ చంద్రిక, నిర్ణయ సింధు, గ్రంథాలు అక్షయ తృతీయ "పరశురామ జయంతి" పేర్కొంటున్నాయి. శ్రీకృష్ణుని, శ్రీరాముని జయంతులు, జరుపుకుంటున్న విధంగా, పరశు రామ జయంతిని కూడా జరపాలని శాస్త్ర వచనం. పరశు రాముడు చిన్నతనంలో తన తండ్రి పితామహుడైన భృగు మహర్షి ఆశ్రమానికి వెళ్లగా, ఆ బాలకుని తేజస్సుకు తాళలేక, భృగు మహర్షి కళ్ళు మూసుకొని, ఆ బాలకుని హిమాలయాలకు వెళ్లి తపమాచరించిన మని సూచించాడు. బాలకుని తపస్సుకు, శివుడు ప్రత్యక్షమై, "నీవు ఇంకా చిన్నవాడివి, రౌద్రాస్త్రాలు, భరించే శక్తి నీకు లేదని కొంతకాలం తీర్థయాత్రలు చేయాలని", హితవు పలికాడు. తీర్థయాత్రలు పూర్తిచేసుకుని, తిరిగి తపస్సు ప్రారంభించగా, ఆ సమయంలో రాక్షస బాధలు తాళలేక, ఇంద్రాది దేవతలు శివుని శరణు వేడగా, భార్గవ రామునికి, పరమ శివుడు, "పరశువు" అనే గండ్రగొడ్డలి ఇచ్చి రాక్షసుల పైకి పంపడం చేత పరుశురామ నామాంకితుడైనాడు. అలా స్వర్గంలో రాక్షసులను లేకుండా చేశాడు. ఓ సందర్భంలో పరశు రాముడు, శివుని దర్శించబోగా ద్వారం వద్ద వినాయకుడు అడ్డగించాడు. కోపంతో పరశు రాముడు తన పరశువును విసిరేశాడు. తన తండ్రి శివుని ప్రసాదమైన పరశువుపై గౌరవంతో వినాయకుడు ఆ పరశువుతో తన దంతం విరిగేలా సమర్పించు కొన్నాడు.

ఒకనాడు తల్లి రేణుక, నీళ్ళు తేవడానికి ఏటికి వెళ్లి అక్కడ చిత్రరథుడనే, గంధర్వ రాజు కుమారుడు, తన భార్యతో జలవిహారం చేయడాన్ని చూసి, తనకు అలాంటి అదృష్టం లేదని చింతిస్తూ, ఆశ్రమానికి ఆలస్యంగా వెళ్ళింది. ఆమె ఆలస్యానికి కారణం తెలుసుకున్న జమదగ్ని, కళంకితయైన, తల్లిని ఖండించాలి అని కుమారులను కోరాడు. ముగ్గురు మొదటివారు ఒప్పుకోని స్థితిలో, నాలుగవ వాడైన పరశు రాముడు తండ్రి ఆజ్ఞను శిరసా వహించి, ఆమెను ఖండించాడు. అప్పుడు తండ్రి, పరశురాముని ఏదైనా వరం కోరుకోమనగా, తనకు మాతృ భిక్ష పెట్టమని ప్రార్థించాడు. అలా రేణుక పునరుజ్జీవితురాలు అయింది. తండ్రి ఆశ్రమంలో లేని సమయాన కార్తవీర్యార్జునుడు అనే రాజు కామధేనువు "సురభి" ని బలవంతంగా తీసుకు పోగా, పరశురాముడు, ఆ రాజును



హతమార్చి, తిరిగి తెచ్చాడు. అందుకు పగబట్టిన కార్తవీర్యార్జునుని కుమారులు, జమదగ్నిని హత మార్చగా, తిరిగివచ్చిన పరశు రాముడు, విషయం తెలుసుకుని, వారి మీదికి దండెత్తి, గర్భస్థ పిండాలను కూడా వదలక చంపాడు. వారి నెత్తుటితో పితృ తర్పణం గావించాడు. పరశు రాముడు యావత్ క్షత్రియ జాతిపై ఆగ్రహించి వారిపై 21 మార్లు దండెత్తి క్షత్రియ వంశాలను నాశనం చేశాడు. శ్యమంతక పంచకమనే 5 సరస్సులను క్షత్రియుల రక్తంతో నింపి పరశు రాముడు తల్లి దండ్రులకు తర్పణం అర్పించాడు.

ఇలా అందరినీ హతమార్చడం చేత భూమి అంతా పరశు రాముని వశం అయింది. యజ్ఞం చేసి భూమి అంతయు బ్రాహ్మణులకు దానం చేశాడు. అశ్వమేధయాగం చేసి ఆ భూమిని కశ్యపుడికి దానంగా ఇచ్చాడు. అప్పటి నుండి భూమికి 'కశ్యపి' అనే పేరు వచ్చింది. దానం ఇచ్చిన నేలపై ఉండ కూడదని, బ్రాహ్మణులు అనగా... పరశు రాముడు సముద్రం వద్దకు వెళ్లి, తన స్రువమును, సముద్రం లోనికి విసిరి వేయగా, రెండు యోజనాల దూరంలో పడగా, సముద్రుడు ఆ ప్రదేశం నుండి ఉపసంహరించు కున్నాడు. దానినే కొత్తగా ఏర్పడిన "మలబారు" ప్రాంతంగా చెబుతారు. అక్కడే పరశు రాముడు నివసించగా, ఆయన ఉన్న చోట కరువు ఉండదని, వజ్రోత్సవ చంద్రికలో పేర్కొన బడింది.

"అబ్రహ్మణ్యే తథా దేశే కైవర్తాన్ ప్రేక్ష భార్గవ: స్థావయిత్వా స్వకీయే సక్షేత్రే విప్రాన్ ప్రకల్పితాన్"..స్కంధ పురాణం ఆధారంగా, కశ్యప బ్రాహ్మణునిచే వెడల కొట్టబడిన వాడైన పరశు రాముడు, సహ్యాద్రి పర్వత ప్రాంతమందు నివసించి, అక్కడి ఆటవికమైన కొండ జాతి వారికి జంధ్యములు వేసి బ్రాహ్మణులుగా మార్చినట్లు వివరించ బడింది. పరశు రాముడు 'కైవర్తా' ఆటవికులను బ్రాహ్మణులుగా గుర్తించడం వల్లనే కాబోలు - కొన్ని జాతుల వారికి 'రేణుకాదేవి' యిలవేల్పయినది

# అక్షయ ఫలాన్ని ఇచ్చేది తృతీయ

(రామ కిష్టయ్య సంగనభట్ల, 9440595494)

హిందువుల పండుగలలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నది అక్షయ తృతీయ. వైశాఖ శుద్ధ తృతీయ నాడు చేసే దానాలు దేవతల, పితృదేవతల గురించి చేసే పూజలు, అక్షయ ఫలాన్ని ఇస్తాయని, ప్రాచీన గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. తీర్థ స్నానం, తిలలతో పితృ తర్పణం, ఘట దానం, దైవ పూజలు, ఈ దినాన దానం చేయడం అనాదిగా ఆచరణలో ఉంది. నదీస్నానం దానం, తపం, శ్రాద్ధం, హోమం చేయాలని వ్రత గ్రంథాలలో ఉంది. అక్షయ తృతీయనాడు పెరుగు అన్నం, విసనకర్రలు, గొడుగులు, పాదుకలు, చెప్పులు, ఉద కుంభం, మున్నగు వాటిని దానం చేయాలని చెప్పబడింది. ఎండలు మెండుగా ఉండే వైశాఖ మాసంలో కుండలలో, జాగ్రత్తగా పెట్టిన నీటిని త్రాగితే, దాహ శాంతి కరంగా ఉండగలదని, మతపెద్దల నిర్ణయానుసారం, నీటితో నిండిన పాత్రలను, కుండలను ( ఉదకుంభ) దానం చేయడం ఆచారంగా మారింది. ఈ రోజున, విష్ణుపూజ లక్ష్మీ నారాయణ రూపంలో చేయాలని, పురుషార్థ చింతామణి యందు పేర్కొనబడింది. గౌరీ పూజ గౌరీ వ్రతం పేరున పూజ చేయడం కొన్ని ప్రాంతాలలో, ఆలయాలలో ఆచారంగా ఉంది. ఆహవనీయ, గార్హపత్య, దక్షిణములు అనబడే త్రేతాగ్నులు పూజింపబడిన కాల మగు 196 వేల మానవ సంవత్సరాల క్రితం త్రేతా యుగానికి, ఇది తొలి రోజుగా, యుగాదిగా భావించబడుతున్నది. వైశాఖ శుక్లపక్ష తదియ బలరామ జయంతిగా పంచాంగాలు పేర్కొంటున్నాయి. తాటిచెట్టును కేతనం మీద నిలుపుకొని, తమకు సాధనమైన, నాగలిని ఆయుధంగా కలిగి, తమను హర్ష కులుగా చేసిన, బలరాముని జయంతి దినమైన, అక్షయ తదియ తెలుగునాట కర్షకుల కార్యకలాపాలకు, ముఖ్య కేంద్రంగా మారింది. అందుకే ఈ ప్రాంతం కర్షకులు, తమ పొలాలలో గృహస్తులు తమ పెరళ్ళలో, ఏ రోజున కూర పాదులు కట్టడం కూడా సనాతన ఆచారంగా మారింది. మహాలక్ష్మికి ప్రీతిపాత్రమైన, అక్షయ తృతీయ నాడు బంగారం కొనుగోలు చేసి, దాచి ఉంచితే, సంపద ఇతోధికంగా వృద్ధి కాగలదనే విశ్వాసంతో,



అక్షయ తృతీయ రోజున, బంగారం కొనడం సాంప్రదాయంగా ఆచరించ బడుతున్నది. "వైశాఖే మాసి రాజేంద్ర, శుక్ల పక్ష తృతీయ కా: అక్షయాసా తిథి: ప్రోక్తా కృత్తికా రోహిణీ యుతా:

అక్షయ తృతీయ సోమ లేదా బుధవారాల్లో అయితే విశిష్టమని, కృత్తిక రోహిణీ నక్షత్రముతో కూడి ఉన్నది అయితే, పర్వం అతి ప్రశస్తం అని భావన. ఈ పర్వం పూర్వాహ్న వ్యాపిని అనీ, వ్రత రాజము చెపు తున్నది. ఇది ఒక గొప్ప పుణ్య దినంగా భావించ బడుతున్నది. ఈనాడు నదీస్నానం, సకల పాప విమోచన కరమని, ఒక పూట భోజనం చేయాలని భక్తుల విశ్వాసం. లక్ష్మి సహిత నారాయణుని, గౌరీ సహిత త్రిలోచనుని, పూజించడం శ్రేష్ఠం తరంగా చెప్పబడింది. పూజ సమయంలో విసనకర్రలు, లడ్డూలు పంచితే వైకుంఠాన్ని, శివ లోకాన్ని పొందగలరని శాస్త్ర వచనం.

### :: అక్షయ తృతీయ విశిష్టతలు ::

మన పురాణాలు, పండితులు చెబుతున్న అక్షయ తృతీయ విశిష్టతలు ఎన్నో ఉన్నాయి. ఈ రోజే మహా విష్ణువు ఆరవ అవతారమైన పరశురాముని జననం.ఈ పవిత్ర దినానే త్రేతాయుగం ప్రారంభమైనదని పండితుల మాట. గంగమ్మ భువిపై ఉద్భవించిన రోజు ఈ రోజే. అక్షయ తృతీయ నాడే వ్యాస మహర్షి "మహా భారతం" పవిత్ర గ్రంధాన్ని రచన పారంభించిన రోజు. ఈ రోజే అమ్మ "అన్నపూర్ణ దేవి" అవతరించిన రోజు. అక్షయ తృతీయ పవిత్ర దినాన్నే కుబేరుడు శివానుగ్రహాన్ని పొంది మహాలక్ష్మి ద్వారా అనంత సంపదను పొంది సంరక్షకుడిగా నియమింప బడ్డాడు. శ్రీకృష్ణుడు ద్రౌపదిని దుశ్శాసన దుశ్చర్య నుండి కాపాడిన దినం. శ్రీకృష్ణుడు తన బాల్యమిత్రుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను ఆరగించి అపార సంపదను అనుగ్రహించిన రోజు. సూర్య భగవానుడు అజ్ఞాత వాసంలో పాండవులకు "అక్షయపాత్ర"ను ఇచ్చినరోజు. ఆదిశంకరుల వారు ఓ పేద వృద్ధ జంట లబ్ది కోసం సృష్టిలో తొలిసారి "కనకధారాస్థవం" స్తుతించిన రోజు. ఈ పవిత్ర దినానే, దివ్య క్షేత్రం "బద్రీనాథ్" ఆలయ ద్వారాలు 4 నెలల దర్శన విరామం తర్వాత, పునః దర్శనార్థమై తెరుచుకో బడతాయి. ఏ ఏటికా ఏడు ఒడిషా పూరి రథయాత్ర సంబరాల కొరకు నిర్మించే రథ నిర్మాణం ప్రారంభించే రోజు. ఈరోజే సింహాచలం దివ్యక్షేత్రంలో సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం మరియు చందనోత్సవం ప్రారంభపు రోజు. బృందావనం లోని బంకే బిహారి ఆలయంలో,